


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 158 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 01 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




### వేట్లపాలెంలో

# మృత్యునిలయం

## 20మంది నిరుపేదల సజీవ దహనం

- బాణాసంచా బలిపీఠంపై రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల ప్రాణాలు
- బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వం... రూ.22లక్షల పరిహారం
- అనాథలైన పిల్లలకు ప్రభుత్వ ఖర్చుతో రెసిడెన్షియల్ విద్య, ఇళ్లు లేని వారికి పక్కా గృహాలు
- దోషులు ఆస్తులు జప్తు చేసి బాధితులకు పంచుతాం
- బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా

**అధికారుల నిర్లక్ష్యంపై ఉక్కుపాదం..**
**ఆర్డీవో, డీఎస్పీ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు**

కాకినాడ, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్ :

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం ఘోర విషాదం చోటుచేసుకుంది. పూట గడుపుకోవడానికి రోజువారీ కూలీకి వెళ్లిన 20 మంది నిరుపేదలు బాణసంచా (ఫైర్ వర్క్) తయారీ కేంద్రంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో సజీవ దహనమయ్యారు. పేలుడు తీవ్రతకు మృతదేహాలు, శరీర భాగాలు తునాతునకలై గాల్లోకి ఎగిరిపడటం అక్కడి భయానక వాతావరణానికి అద్దం పట్టింది. ఈ హృదయ విదారక ఘటనలో మరో 9 మంది తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో పోరాడుతున్నారు. మృతుల్లో 12 మంది ఎస్సీలు, మిగతా .. 2లో..

---

రూ.5,456 కోట్ల వార్షిక బడ్జెట్‌కు

## తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలోని వకుళ మాత ఆలయంలో గోవింద అక్షరమాల కార్యక్రమాన్ని ప్రారంభించాలని తితిదే నిర్ణయించింది. ఒంటిమిట్టలో 108 అడుగుల ఎత్తయిన జాంబవంతుడి విగ్రహ ఏర్పాటుకు రూ.20.17 కోట్లతో పనులు చేపట్టేందుకు తితిదే ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రూ.5,456 కోట్ల తితిదే వార్షిక బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. వార్షిక బడ్జెట్‌తో పాటు పలు కీలక అంశాలపై బోర్డు చర్చించింది. ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. ఒంటి మిట్ట కోదండ రామ కల్యాణానికి వచ్చే భక్తులకు ఉచిత లడ్డూ పంపిణీని బోర్డు ఆమోదిం చినట్లు ఆయన తెలిపారు. గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రహదారి, డ్రెయిన్ల అభివృద్ధికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

---

# సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా

**సుపరిపాలన- ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం - కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు**
**మూడేళ్లలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి - గత పాలనలో ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం**
**విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు**

**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్ల లోపు బాలికలంతా విధిగా హెచ్ పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావి వలసలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ , పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడబిడ్డలు సర్వై కల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశ వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ వల్లే ప్రపంచవ్యాప్తంగా 74 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63 శాతం ఉండగా మన రాష్ట్రంలో 68 శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379 నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లో నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వై కల్ వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువుగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్




రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్ష మంది మహిళల్లో 15 నుంచి 20 మంది సర్వై కల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్ల లోపు వయసున్న మిగతా .. 2లో..

---

వేట్లపాలెంలో పేలుడు.. మృతుల కుటుంబాలకు

## పరిహారం ప్రకటించిన ప్రధాని



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా బాధా కరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

---

జల మండలికి శారదా పీఠం

## భూముల కేటాయింపు రద్దు

**తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూములను పీఠానికే కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఠం భూముల్లో మిగతా .. 2లో..

---

గోదావరి పుష్కరాల నిర్వహణపై

## ఒకసారి కూర్చుని మాట్లాడుకుందాం

**తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆనం రామనారాయణరెడ్డి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల నిర్వహణపై ఒకసారి కూర్చుని మాట్లాడుకుందాం అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వెలగపూడిలోని అసెంబ్లీకి వచ్చిన వారి ఎదుట ఆనం ఈ ప్రతిపాదన పెట్టారు. 'మేం కాళేశ్వరంలో చాలా గొప్పగా చేయాలనుకుంటున్నాం' అని భట్టి చెప్పగా ఆనం స్పందించారు. 'మేం కూడా ఇక్కడ ఏర్పాట్లకు సిద్ధమవుతున్నాం. ఈ పుష్కరాల గురించి తెలంగాణ ప్రభుత్వంతో కూడా ఒకసారి మాట్లాడి, సమన్వయం మిగతా .. 2లో..

---

కల్తీ పాలు బాధితులకు

# అండగా ప్రభుత్వం

**వైద్య సేవలు మరింత బలోపేతం : మంత్రి నిమ్మల రామానాయుడు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీ పాలు ఘటన నేపథ్యంలో జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని, ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైతే హైదరాబాద్ నుండి సీనియర్ వైద్యులను రప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా యంత్రాంగం మరియు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని సూచించారు. కొత్తగా డయాలసిస్ కేసులు నమోదు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి నిమ్మల రామా నాయుడు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తో తాజా పరిస్థితులపై, క్షేత్ర స్థాయి పరిశీలనలో బయటపడిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డీఎంహెచ్‌వో కే. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

---

## మక్కా యాత్రలో బస్సు ప్రమాదం..

**మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ చేసిన సీఎం రేవంత్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు. గతేడాది నవంబర్ 17న మక్కా యాత్రలో జరిగిన బస్సు మిగతా .. 2లో..

---

## పశ్చిమాసియా ఘర్షణలు..

**వెనక్కి తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం**




**విశ్వం వాయిస్ న్యూస్ :** దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా భగ్గుమంది. ఇజ్రాయెల్, ఇరాన్‌లు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దిల్లీ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిరిండియా విమానం వెనక్కి తిరిగివచ్చింది. పశ్చిమాసియాకు వెళ్లే విమానాలు రద్దు మిగతా .. 2లో..

---

విశాఖ పార్టీ కార్యాలయంలో

## లోకేష్ 82వ రోజు ప్రజాదర్బార్

**ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరణ**
**సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ**



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లాలో బ్లూ జెట్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ పట్నం చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. నేడు ఉదయం విశాఖ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# వేట్లపాలెంలో మృత్యువిలయం..

## 20 మంది నిరుపేదల సజీవ దహనం!

తొమ్మిది మంది మహిళలు ఉండటం ఈ విషాదం తీవ్రతను మరింత పెంచింది. తమ వారు ఏమయ్యారో తెలియక, కాలిపోయిన దేహాలను చూసి గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో వేట్లపాలెం కన్నీటి సంద్రమైంది.

**అసలు ప్రమాదం ఎలా జరిగింది? ప్రాణాలతో చెలగాటమెవరిది?**

వేట్లపాలెంలోని ఈ బాణసంచా కేంద్రంలో నిత్యం పదుల సంఖ్యలో కూలీలు పనిచేస్తుంటారు. లాభాపేక్షతో యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసింది. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో పరిమితికి మించి భారీ ఎత్తున ప్రమాదకర రసాయనాలు, ముడిసరుకు నిల్వ ఉంచినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా నిప్పంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. క్షణాల్లోనే మంటలు పరిశ్రమ అంతటా వ్యాపించడంతో, కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసే అవకాశం కూడా దక్కలేదు. కళ్లెదుటే తమ తోటి కార్మికులు అగ్నికి ఆహుతవుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో స్థానికులు ఉండిపోయారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ఉక్కుపాదం.. నలుగురిపై సస్పెన్షన్ వేటు**

ఈ ఘోరానికి ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో కూడిన ఈ కేంద్రంపై కనీస పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఇంతటి ఘోరం జరిగిందని భావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**సస్పెండైన అధికారులు:** విధి నిర్వహణలో అలసత్వం వహించిన స్థానిక లిఆర్డీఓ, డీఎస్పీ, జిల్లా లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్‌లనులి తక్షణమే సస్పెండ్ చేస్తూ సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**సీఎం హెచ్చరిక:** "ప్రజల ప్రాణాలతో ఆడుకునే విచ్చలవిడితనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. అనుమతులు తీసుకున్న తర్వాత భద్రతా ప్రమాణాలు పాటించకపోతే పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులది కాదా? ఈ ఘటనకు కారణమైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. బాణసంచా కేంద్రాల యాజమాన్యాన్ని అరెస్టు చేయడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అప్పగిస్తాం" అని సీఎం కఠినంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఫైర్ వర్క్స్ కేంద్రాలకు సీసీటీవీలు తప్పనిసరి చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తామని స్పష్టం చేశారు.

**పెద్దదిక్కుగా కదిలివచ్చిన ముఖ్యమంత్రి.. బాధితులకు భరోసా**

విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రమాద వార్త తెలియగానే చలించిపోయారు. వెంటనే తన పర్యటనను రద్దు చేసుకుని, హెలికాప్టర్‌లో నేరుగా వేట్లపాలెం చేరుకున్నారు. తొలుత ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సామర్లకోట పీహెచ్‌సీ, కాకినాడ జీజీహెచ్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులను ఓదారుస్తూ సీఎం స్వయంగా కంటతడి పెట్టుకున్నారు.

**బాధితులకు న్యాయం.. భవిష్యత్తుకు కొండంత అండ**

నిరుపేద కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడకుండా ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. ఈ ఘటనలో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు:

1. **రూ.22 లక్షల ఆర్థిక సాయం:** మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.20 లక్షలు, కేంద్రం నుంచి రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.22 లక్షల ఎక్స్‌గ్రేషియా.
2. అనాథలైన పిల్లలకు ఉచిత విద్య: ఈ ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లల చదువు బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే తీసుకుని, వారిని రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిస్తుంది.
3. **పక్కా గృహాల నిర్మాణం:** ఇళ్లు లేని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఖర్చుతోనే కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం స్పష్టం చేశారు.

"చనిపోయిన వారిని తిరిగి తీసుకురాలేము, కానీ ఆ కుటుంబాలకు ప్రభుత్వం కొండంత అండగా ఉంటుంది. దోషులకు కఠిన శిక్ష పడేలా చేసి, బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తాం." – ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**సహాయక చర్యల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు**

ప్రమాద వార్త తెలిసిన వెంటనే రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హైదరాబాద్ నుంచి హుటాహుటిన కాకినాడ చేరుకుని, కలెక్టర్, ఎస్పీలతో సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, స్థానిక నేతలు తుమ్మల బాబు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాకినాడ నగర, జిల్లా టీడీపీ నేతలు వనమాడి మోహన్ వర్మ, మల్లెపూడి వీరేంద్ర కుమార్ తదితరులు ఆసుపత్రిలో బాధితులను పరామర్శించి, సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు.

# సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా

బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటు చేసి 16,912 సిబ్బందిని నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**లక్షలో 18 మంది క్యాన్సర్ బారిన**

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 90-70-90 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18 మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతో పాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు, యువిన్ యాప్ ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీని వల్ల ప్రమాదం ఉండదు. 15 ఏళ్ల వయసున్న బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రజారోగ్యానికి రాష్ట్రంలో అధిక ప్రాధాన్యత**

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తృతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షల మంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. నోటి క్యాన్సర్‌కు సంబంధించి 5,07,590 మందిని, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి 2,50,897 మంది, సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించి 3,40,154 మందిని రిఫర్ చేశాం. కర్నూలులో రూ. 50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. గత బడ్జెట్ కంటే 4 శాతం పెంచి ఈ బడ్జెట్ లో వైద్య ఆరోగ్య రంగానికి రూ.19305 కోట్లు కేటాయించాం. రాష్ట్ర బడ్జెట్ లో ఇది 6 శాతంగా ఉండటం ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యతకు నిదర్శనం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు అందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించేలా ఈ పాలసీ రూపకల్పన జరిగింది. ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. క్రిమిసంహారక మందులతో పండించిన ఆహారం తీసుకుని క్యాన్సర్ బారిన పడుతున్నాం. అలాగే ప్రతి ఒక్కరూ మితాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తీర్చిదిద్దాలనే ది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**పింఛనుతో పేదల జీవితాల్లో వెలుగులు**

20 నెలలుగా ఒకటో తేదీన నేను స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 62,76,322 మందికి పింఛన్లు ఇస్తుండగా, నెలకు రూ.2,726 కోట్ల మేర ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి ఈ పథకం కోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే నిలిపి వేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో మూడు నెలలదీ కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళితే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం నవ్వడానికి వీలు లేదు. ఇళ్లలో ఎవరూ సురక్షితంగా ఉండలేకపోయారు. రౌడీయిజం పరాకాష్టకు చేరింది. నాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారు. అయినా నేను కుంగిపోలేదు. ప్రజల కోసమే పనిచేస్తున్నాను. మిత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రం కోసం అండగా నిలబడ్డారు. వెంటిలేటర్ పై ఉన్న మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ఆక్సిజన్ అందిస్తోంది. ప్రజలు ఎన్డీఏను గెలిపించడంతో ఢిల్లీలో కూడా మన పరపతి పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు.

**సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం**

ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. ఆడబిడ్డల కోసం కోసం స్త్రీ శక్తి తీసుకొచ్చాం. ఇప్పటి వరకూ 47 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేశారంటే అదీ ఆడబిడ్డల సంక్షేమంపై మన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల్లో రూ.6,310 కోట్లు ఇచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టూ భర్తీ చేయలేదు. విద్యపై అసలు దృష్టే పెట్టలేదు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో చిన్న పిల్లల సంఖ్య తగ్గుతోంది. జనాభానే మన దేశ సంపద. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వచ్చాయి. భోగాపురం ఎయిర్ పోర్టులు రాకతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరిగి ఉపాధి పెరుగుతుంది. విజయనగరం జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ త్వరలోనే ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పెట్టి పేదల ఆకలి తీర్చాం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేందుకే పీ4 విధానం తీసుకొచ్చాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత ప్రభుత్వంలో భూములు రికార్డులు తారుమారు చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏ కింద పెట్టేశారు. డిసెంబర్ లోగా అన్ని భూములు సర్వే చేస్తాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

**దేవుడికి ద్రోహం చేశారు**

గత పాలకులు తిరుమల వేంకటేశ్వర స్వామికే అపచారం తలపెట్టారు. స్వామి ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు. కెమికల్స్ తో లడ్డూ తయారు చేసి స్వామికి నైవేద్యంగా పెట్టారు. ప్రజలకే కాదు దేవుడికి కూడా ద్రోహం చేయాలని చూశారు. అలాంటి వారు రాజకీయాల్లో ఉంటే సమస్యలు వస్తాయి. దేవుడికి కూడా ద్రోహం చేసే వారికి వదిలిపెట్టకూడదు. నేను ఆ దేవుణ్ణి బజారులోకి లాగాలనుకోలేదు. కానీ జరిగిన తప్పులను ప్రజలకు వివరించాను. చేసిన తప్పును ఇతరులపై నెట్టే ప్రయత్నం చేశారు. గత ఐదేళ్లలో లడ్డూ నాణ్యత ఎలా ఉందో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలా ఉందో ప్రజలు గమనించాలి. వైసీపీ వాళ్లు అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చించేందుకు రారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామంటున్నారు. అడ్డదారులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో రాజకీయాలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయికి నిలయంగా మార్చేశారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరిస్తామని సీఎం వెల్లడించారు.

**జల మండలికి శారదా పీఠం**

# భూముల కేటాయింపు రద్దు

జలమండలి చేపట్టిన నిర్మాణ పనులను శారదాపీఠం ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలికి కేటాయింపులను రద్దు చేసి.. పీఠానికే ఆ భూములను కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని శారదాపీఠం ప్రతినిధులకు సూచించారు.

**గోదావరి పుష్కరాల నిర్వహణపై**

# ఒకసారి కూర్చుని మాట్లాడుకుందాం

చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. నేను, మా పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ మీతో ఈ విషయమై మాట్లాడాలి' అని చెప్పారు. దీంతో 'ఆ పేరుతోనైనా మీరు హైదరాబాద్‌కు రండి' అని భట్టి సరదాగా వ్యాఖ్యానించారు. 'అదే ఒకసారి మాట్లాడదాం, మేం రావడమో, మీరు రావడమో.. ఏదైనా పర్లేదు. పుష్కరాలపై ఒక ఆలోచన చేద్దాం' అని ఆనం ఆయనకు చెప్పారు. తప్పకుండా కూర్చుందాం, మాట్లాడి మంచి ఏర్పాట్లు చేద్దాం అని భట్టి, శ్రీధర్‌బాబు చెప్పారు. వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత ఆనం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

**10 కోట్ల మందికిపైగా వస్తారు**

రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, మరో రెండు చోట్ల ఈసారి పుష్కరాలకు 10 కోట్ల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేసినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఘాట్‌లను 400 వరకు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

# మక్కా యాత్రలో బస్సు ప్రమాదం..

ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమైన విషయం తెలిసిందే. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

# పశ్చిమాసియా ఘర్షణలు..

చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. మరో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కూడా పశ్చిమాసియా దేశాలకు విమానాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు ముఖ్యమని పేర్కొంది. నిరంతరం పరిస్థితులు మారుతుండడంతో ప్రయాణికులకు కావాల్సిన సర్దుబాట్లు చేయడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నారని వెల్లడించింది. పశ్చిమాసియాలో అస్థిరమైన పరిస్థితుల మధ్య ఆయా దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలకు అంతరాయాలు ఎదురయ్యే అవకాశం ఉందని దిల్లీ విమానాశ్రయం ప్రయాణికులకు హెచ్చరిక జారీ చేసింది. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్‌లకు వెళ్లాల్సిన తమ విమానాలను రద్దు చేస్తున్నట్లు అనేక విమానయాన సంస్థలు వెల్లడించాయి. ఈ మేరకు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ ఇతర దేశాలకు చెందిన విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి.

**విశాఖ పార్టీ కార్యాలయంలో**

# లోకేష్ 82వ రోజు ప్రజాదర్బార్

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 82వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వేతన స్కేళ్లను వర్తింపజేయాలని అనకాపల్లి జిల్లాకు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫార్మసీలో మాస్టర్స్ చేసిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన ఏ.యామిని కోరారు. అనకాపల్లి జిల్లా సీతపాలెం గ్రామ భూ నిర్వాసితుల పునరావాసం, నష్టపరిహారం, సైట్ కేటాయింపుతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి లక్ష్మీదేవిపేటలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ కనకదుర్గమ్మ ప్రార్థన సొసైటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. ఇటీవల ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా పవిత్ర ఆలయానికి భంగం కలగకుండా చూడాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పర్వాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీల దిలీప్ కుమార్ తమ ఇంటిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని అనకాపల్లికి చెందిన పి.సతీష్ కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

**అమలాపురంలో ఘనంగా**

# మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు

**తెలుగు భాష మన అస్తిత్వానికి ప్రతీక కంభంపాటి హరిబాబు**


**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**




తెలుగు భాష కేవలం సంభాషణ మాధ్యమం మాత్రమే కాకుండా, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, సాహిత్యం, కళలు, మన అస్తిత్వానికి ప్రతీక అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. శనివారం అమలాపురంలోని కిమ్స్ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహిం చిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల తొలి రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడం, తెలుగు భాషా వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పడం ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని గవర్నర్ తెలిపారు. భాష అనేది ఒక జాతి ఆత్మ అని, భాష నిలిచినప్పుడే సంస్కృతి నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడిని స్మరించుకుంటూ, తెలుగు భాష పరిరక్షణ ప్రతి తెలుగువారి సామూహిక బాధ్యత అని పిలుపునిచ్చారు. యువతలో తెలుగు భాషపై ప్రేమ, గౌరవం పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఆధునిక సాంకేతికతను వినియోగించి తెలుగు భాషను డిజిటల్ ప్రపంచంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు సాహిత్యం, సంగీతం, నాటకం, జానపద కళలను ప్రపంచ వేదికలపై ప్రతిష్ఠింపజేయాలని సూచించారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు తమ పిల్లలకు మాతృభాషపై పట్టు కల్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తెలుగు భాషకు వేల ఏళ్ల చరిత్ర ఉందని, ప్రపంచంలోని ప్రధాన భాషలలో ఒకటిగా తెలుగు ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు మాట్లాడుతూ, భాషాభిమానమే జాతీయ గర్వానికి పునాది అని అన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తమ ప్రసంగాల్లో కోనసీమ నేలపై ఇలాంటి అంతర్జాతీయ స్థాయి మహాసభలు జరగడం గర్వకారణమని తెలిపారు. సహస్ర అవధాని గరికపాటి నరసింహారావు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సినీ నటుడు తనికెళ్ల భరణి తదితర ప్రముఖులు పాల్గొని తెలుగు సాహిత్య ఔన్నత్యం, సంస్కృతిక వారసత్వం, భాషా గర్వం గురించి ప్రసంగించారు. వక్తలు తమ ప్రసంగాల్లో తెలుగు భాష కేవలం గతానికి మాత్రమే సంబంధించినది కాదని, భవిష్యత్తుకు దారి చూపే శక్తి కలిగిన జీవంతమైన భాష అని పేర్కొన్నారు. భాషా పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కీలకమని, పాఠశాల స్థాయి నుంచే తెలుగు బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మహాసభల తొలి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జానపద నృత్యాలు, హరిదాసుల కీర్తనలు, సాహిత్య సభలు, కవిసమ్మేళనాలు, సంగీత ప్రదర్శనలు పాల్గొన్న వారిని అలరించాయి. దేశ విదేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు, పండితులు, కళాకారులు తెలుగు భాషా వైభవాన్ని ఘనంగా కీర్తించారు. ప్రపంచ తెలుగు మహాసభలు ప్రతి తెలుగువారికి పండుగలాంటివని, భాషా గర్వాన్ని మరింత బలపరుస్తాయని, ప్రపంచ వేదికపై తెలుగు ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోనసీమ నేలపై తెలుగు మహాసభలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనలో 20 మంది మృతి

**సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు దిగ్భ్రాంతి**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో శ్రీ సూర్య ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర పేలుడు ఘటనలో 21 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ విషాద ఘటనపై సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన భద్రతా ప్రమాణాల లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిందని ఆయన ఆరోపించారు. లాభాల కోసం ప్రాణాలను పణంగా పెట్టే విధంగా వ్యవహరించడం అమానుషమని మండిపడ్డారు. బాధ్యులపై హత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు కనీసం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఒక కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి, ఆస్తి నష్టం చెందిన వారికి పూర్తి పరిహారం చెల్లించాలని ఆయన తెలిపారు. ఈ ఘటనపై హైకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపి, భవిష్యత్తులో నివాస ప్రాంతాల్లో ప్రమాదకర పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకుండా కఠిన చర్యలు చేపట్టాలని పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు సిపిఐ (ఎంఎల్) పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## టీడీపీ సీనియర్లకు మంత్రి యోగం?

తెలుగుదేశం పార్టీ కూటమిని నాయకత్వం వహిస్తోంది. మిత్రులతో పాటు సొంత పార్టీ వారికి పదవులు పంచుతూ అంతటా కో ఆర్డినేషన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం సీనియర్లకు కొందరికి సరైన అవకాశాలు దక్కలేదు, దాంతో వారు అసంతృప్తి చెందుతున్నారు. సీనియర్ నేతలుగా ఉంటున్నా పూర్వం మాదిరిగా పూర్తి స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. తమ సొంత నియోజకవర్గాలకే పరిమితం అవుతున్నారు. మంత్రి పదవి ఇస్తే కనుక వారు జిల్లా రాజకీయాలను శాసించడమే కాదు కూటమిని ప్రభుత్వాన్ని మరింతగా బలోపేతం చేస్తారు అని అంటున్నారు. కూటమి పాలన కావడం మిత్రులకు పదవులు కట్టబెట్టడం ఇతర ఈక్వేషన్స్ వల్ల సీనియర్లకు అవకాశాలు ఇప్పటిదాకా రాలేదని అంటున్నారు. అయితే ఇపుడు టీడీపీ సీనియర్ల గురించి సీరియస్ గానే ఆలోచిస్తోంది అని అంటున్నారు.

**ముగ్గురి మీద ఫోకస్ :**

ఉత్తరాంధ్రాలో ఉమ్మడి జిల్లాలుగా ఉన్న విశాఖ విజయనగరం శ్రీకాకుళంలలో సీనియర్లు అంతా పార్టీకి వీర విధేయులై దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. ఇపుడు వారిని మరింతగా ప్రోత్సహించాలని పదవులు కట్టబెట్టాలని పార్టీ పరంగా సమాలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. అదే విధంగా సామాజిక సమతూకాన్ని సైతం పాటించబోతున్నారు. దాంతో ఉత్తరాంధ్రలో ముగ్గురు సీనియర్లు అయిన గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, మంత్రి అచ్చెన్నాయుడికి కీలక బాధ్యతలను అప్పగించాలని పార్టీ ఒక విధంగా డిసైడ్ అయింది అని ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.

**ఏపీ ప్రెసిడెంట్ గా :**

ఇక చూస్తే కనుక అచ్చెన్నాయుడు 2020లో టీడీపీకి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన ఈ పదవిలో ఉండగానే టీడీపీ ఏపీలో అధికారంలోకి వచ్చింది. అచ్చెన్నాయుడు టీడీపీ ప్రెసిడెంట్ గా దూకుడుగా వ్యవహరించారు అని అంతా అంటున్నారు. ఆయన వైసీపీ మీద గట్టిగా మాట్లాడుతారు. ఏ ఒక్క ఇష్యూని వదిలేయకుండా డిఫెన్స్ లో ఆ పార్టీని పెడతారు అని కూడా పేరు ఉంది. అందుకే అచ్చెన్నాయుడికే మరోసారి ఏపీ టీడీపీ అధ్యక్ష పదవి కట్టబెడతారు అని అంటున్నారు. ఆయన మంత్రిగా ఉన్నారు. వ్యవసాయ శాఖను చూస్తున్నారు. అయితే ఆ జిల్లాలో కింజరాపు కుటుంబానికే రెండు మంత్రి పదవులు ఉన్నాయి. దాంతో కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడుని కొనసాగించి అచ్చెన్నకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారు అని అంటున్నారు.

**వీరిద్దరికీ పదవులు :**

ఇక గంటా శ్రీనివాసరావుకు మంత్రి పదవి ఇస్తారని అంటున్నారు. భీమిలీ నుంచి 90 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిచిన గంటా అంగబలం అర్ధ బలం కలిగిన నాయకుడు, వ్యూహ చతురుడు, ఆయనకు మంత్రి పదవి ఇస్తే విశాఖ జిల్లాలో పార్టీ మరింతగా బలపడుతుందని అంచనా వేస్తున్నారుట. అంతే కాదు బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు రాష్ట్రంలో ఆ సామాజిక వర్గంలో గుర్తింపు ఉన్న నేతగా ఉన్నారు. దాంతో గంటాకు మంత్రి యోగం ఉందని అంటున్నారు. అలాగే యాదవ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి ఖాయమని అంటున్నారు. ఆయన ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా ఉంటున్నారు. అయితే ఆయన సాఫ్ట్ నేచర్ వల్ల అనుకున్నంతగా దూకుడు ప్రదర్శించలేకపోతున్నారు. అంతే కాదు మంత్రి పదవిని ఆయన కోరుకుంటున్నారు అని అంటున్నారు. దాంతో పల్లా కోరిక తొందరలోనే తీర్చాలని హైకమాండ్ ఫిక్స్ అయింది అని అంటున్నారు. ఉగాది తరువాత తీపి కబురు తమ్ముళ్ళకు అందుతుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




మూడుసార్లు అసలైన గోల్డ్ ఇచ్చి..

## నాలుగోసారి నకిలీ బంగారంతో మోసం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ బంగారు బిస్కెట్లు ఇచ్చి అసలు బంగారు నగలను ఎత్తుకెళ్లిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో సుమారు కిలో బంగారు నగలను దుండగుడు అపహరించగా.. వాటి విలువ రూ. 1.60 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. లక్ష్మీకావ్య అనే మహిళ బంజారాహిల్స్‌లో జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తోంది. కొంతకాలం క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కాచిగూడకు చెందిన శ్రీనాథ్ రాఠీ అలియాస్ అంకిత్ ఆమెకు పరిచయమయ్యాడు. తాను ఓ ప్రముఖ వ్యక్తికి వ్యక్తిగత సహాయకుడిని(పీఏ) అని చెప్పి నమ్మించాడు. తమ వద్ద భారీగా బంగారు బిస్కెట్లు ఉన్నాయని, వాటికి సమానంగా బంగారు నగలు ఇవ్వాలని కోరాడు. మొదట లక్ష్మీకావ్య అతని మాటలను పట్టించుకోకపోయినా.. పదేపదే సంప్రదించడంతో ఒప్పుకొంది. మూడు సార్లు నిజమైన గోల్డ్ బిస్కెట్లు ఇచ్చి నగలు తీసుకెళ్లడంతో అతడిపై నమ్మకం పెరిగింది. ఈ క్రమంలో ఈ నెల 25న కిలో బంగారు నగలను తీసుకున్న శ్రీనాథ్.. తాను బయటకు వెళ్తున్నానని చెప్పి తన సహాయకుడు కృష్ణ ద్వారా బంగారు బిస్కెట్లు పంపిస్తున్నానని తెలిపాడు. అదే రోజు బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్ వద్ద కృష్ణ బంగారు బిస్కెట్లు అందజేశాడు. బిస్కెట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అనుమానం వచ్చిన లక్ష్మీకావ్య వాటిని పరీక్షించగా నకిలీవని తేలింది. శ్రీనాథ్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా ఉండటంతో మోసపోయినట్లు గ్రహించింది. కృష్ణను ప్రశ్నించగా, నాలుగు రోజుల క్రితమే తనను పనిలో పెట్టుకున్నాడని, సోమాజిగూడలోని ఓ హోటల్‌లో వసతి కల్పించాడని తెలిపాడు. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## జనసేన కేంద్ర కార్యాలయంలో కార్లు ధ్వంసం

**నిందితుడు శ్రీకాకుళం జిల్లా వాసి – అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు**





**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలోకి ఒక వ్యక్తి చొరబడి కార్లు ధ్వంసం చేయడం కలకలం రేపింది. భద్రత సిబ్బందిని నెట్టేసి, డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ధ్వంసం చేశాడు. నీలాద్రి అనే అతడిని అదుపులోకి తీసుకున్న మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ఖాజూరుకు చెందిన నారద నీలాద్రి (39) కంప్యూటర్ దుకాణంలో పనిచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఉపముఖ్యమంత్రి నివాసం, కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడంతోపాటు కార్లపై దాడిచేయడం విస్మయానికి గురిచేస్తోంది. పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో ఉన్నప్పుడే ఈ ఘటన జరగడం భద్రతా సిబ్బంది వైఫల్యాల్ని తేటతెల్లం చేసింది.


**భవన నిర్మాణ కూలీలతో కలిసి చొరబాటు**

జాతీయ రహదారి పక్కన జనసేన కేంద్ర కార్యాలయం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. అదే ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో నీలాద్రి భవన నిర్మాణ కార్మికులు వెళ్లే ప్రవేశమార్గంలో వారితో కలిసి లోపలికి ప్రవేశించాడు. అక్కడ ప్రైవేటు భద్రతా సిబ్బంది తనిఖీ చేయలేదు. నీలాద్రి నేరుగా సీఎస్‌వో కార్యాలయం వద్దకు వెళ్లి ఫర్నిచర్ శుభ్రం చేస్తుండగా.. భద్రతాధికారి అనుమానంతో ప్రశ్నించారు. ఆయనను తోసేసి అక్కడి సిబ్బందిపై దాడికి దిగాడు. అడ్డుకునేందుకు సిబ్బంది ప్రయత్నం చేయగా పారిపోతూ అక్కడే ఉన్న ఒక కర్ర తీసుకుని కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం, పైలట్ వాహనం అద్దాలు పగలగొట్టాడు. ప్రత్యేక భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు. విచారణలో నీలాద్రి పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. ఇది తనకు మూడోజన్మ అని, తనను అమ్మవారు పవన్ కల్యాణ్ కార్యాలయానికి పంపించారని చెప్పినట్లు సమాచారం. అతడి మానసిక స్థితి సరిగా లేదని పోలీసులు భావిస్తున్నారు.

## కన్నతల్లిని సజీవదహనం చేసిన కొడుకు

**కోటగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వృద్ధురాలైన కన్నతల్లిని కొడుకు సజీవ దహనం చేశాడు. మద్యానికి బానిసై తల్లి భూమవ్వపై దాడి చేసి చంపాడు. తల్లిపై పాత దుస్తులు వేసి నిప్పంటించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**వికారాబాద్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ పట్టణంలోని టౌన్ గంగారం సాయి బాబా కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, దారూర్ సీఐ కార్యాలయానికి అటాచ్‌గా పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ దివ్య (28) తన నివాసంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఎవరైనా వేధించారా..?అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య



**కౌడిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పుల బాధతో రైతు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం మెదక్ జిల్లా కౌడిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై అమరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రెడ్డి శేఖర్(40) వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పొలంలో బోర్లు వేయడానికి రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. వాటిని తీర్చే మార్గంలేక మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులోని చెరువుకట్ట వద్ద చెట్టుకు ఉరేసుకున్నారు. శేఖర్ కుమారుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

## యువతిగా నకిలీ ప్రొఫైల్..

**విశాఖకు చెందిన సైబర్ క్రైమ్ నిందితుడి అరెస్టు**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నిందితుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విశాఖకు చెందిన పెదపూడి ప్రసన్నకుమార్‌గా గుర్తించారు. ఇతడిని మ్యాట్రిమోనియల్, క్రిప్టో ఇన్వెస్ట్ మోసం కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. ఓ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, బాధితులతో పరిచయం ఏర్పరచుకొని, యువతిగా నటిస్తూ పెళ్లి చేసుకుంటానన్న హామీతో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. నకిలీ క్రిప్టో ట్రేడింగ్ ద్వారా పెట్టుబడి పెట్టాలని ప్రలోభాలకు గురిచేసినట్లు గుర్తించారు. ఒకరి నుంచి రూ.11 లక్షలు కాజేసినట్లు విచారణలో తేలింది. దాదాపు 400 నుంచి 500 అక్రమ సిమ్ కార్డులు సేకరించి ఫేక్ అకౌంట్లు తెరిచినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.

## అంతా ప్లాస్టికే..






ఫ్రెండ్స్.. ఇప్పుడు మీకో టాస్క్. ఒకసారి మీ స్కూలు బ్యాగ్‌లో ఎన్ని ప్లాస్టిక్ ఐటమ్స్ ఉన్నాయో లెక్క పెట్టండి. లెక్క చూశాక అమ్మో అనిపిస్తుంది కదూ. ఇంట్లో ఉన్న వస్తువుల్ని కూడా లెక్కిస్తే కళ్లు తేలేయాల్సిందే. మనం వాడే పెన్ను మొదలు లంచ్‌బాక్సుదాకా అంతా ప్లాస్టికే. అవును, మనకు తెలియకుండానే రోజూ బోలెడన్ని ప్లాస్టిక్ వస్తువులు వాడేస్తున్నాం. మన రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగంగా మారిపోయింది. మరి దాని గురించి తెలుసుకుందామా! మనం స్కూలులో క్లే వాడతాం కదా! దాంతో రకరకాల ఆకృతులు తయారు చేస్తాం. ప్లాస్టిక్ కూడా ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవడానికి వీలుగా ఉండే పదార్థం. ప్లాస్టిక్‌ను వేడి చేసి, అది చల్లారే లోపు కావాల్సిన ఆకృతిలోకి మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ కోసం శాస్త్రవేత్తలు చాలా రకాలుగా ప్రయత్నించారు. కాలక్రమంలో రకరకాల ప్లాస్టిక్ పదార్థాలను గుర్తించారు. అప్పట్లో సహజసిద్ధ పదార్థాలైన కర్ర, మెటల్, తోలు వంటివి ఎక్కువగా లభించేవి. ఇలాంటి సింథటిక్ మెటీరియల్‌తో పెద్దగా ఉపయోగం కనిపించ లేదు. 1907లో లియో బేక్‌లాండ్ ఫెనోలిక్ ప్లాస్టిక్‌ను కనిపెట్టారు. భారీ పరిమాణాల్లో తయారు చేయడానికి వీలయ్యే పూర్తిస్థాయి సింథటిక్ మెటీరియల్ అదే. అప్పట్నుంచి పలువురు శాస్త్రవేత్తలు విభిన్న రకాల ప్లాస్టిక్‌లను కనిపెట్టారు. ఇప్పుడు దాదాపు 50కిపైగా రకాల ప్లాస్టిక్కులున్నాయి. ప్లాస్టిక్స్ తయారీలో క్రూడ్‌ఆయిల్ కీలక ముడి సరకు. కాకపోతే ఇది శిలాజ ఇంధనం. అంటే మన భూగోళంపై పరిమితంగా ఉన్న ఒక వనరు. ప్లాస్టిక్‌తో గత వందేళ్లలో ప్రపంచమే మారిపోయింది. ఎలాంటి రూపంలోకైనా మారగలగడం, దృఢంగా ఉండటం, తయారీ సులభం, చవక కావడం వంటి కారణాలతో ప్లాస్టిక్ వాడకం పెరిగింది. కాకపోతే, పర్యావరణానికి అది చేస్తున్న హానితోనే పెద్ద సమస్య. అందుకని, వాడేసిన ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పారేయొద్దు, జాగ్రత్తగా ఉండాలి.

## టెక్ మేధావి.. మూడేళ్లకే కోడింగ్..

**ఆరేళ్లకే బెస్ట్ స్పీకర్‌గా రికార్డు**

హాలో ఫ్రెండ్స్..! ఈమధ్య ఏఐ గురించి మనం తరచూ ఏదో ఒకటి వింటూనే ఉన్నాం కదా! దానికి సంబంధించి జరిగిన ఓ కార్యక్రమంలో మనలాంటి ఓ నేస్తం.. ఏఐ అభివృద్ధి గురించి చాలా బాగా వివరించాడు. ఇంతకీ తనెవరంటే..ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రణ్‌వీర్ సచ్‌దేవాకు ఎనిమిదేళ్లు. తనది మూడో తరగతి చదివే వయసే అయినా ఎంతో అనుభవమున్న కోడర్లు కూడా వివరించలేని విషయాలు అలవోకగా చెప్పేస్తున్నాడు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్–2026లో ఏఐ అభివృద్ధినీ అలాగే భారత తత్వశాస్త్రాన్ని పోలుస్తూ దేవా మాట్లాడిన విధానం అక్కడున్న పెద్దవాళ్లందరినీ ఆకర్షించింది. ఆ సమిట్‌లో ప్రసంగించిన అతి చిన్న వయసు వ్యక్తి కూడా మన దేవానే! అంతేకాకుండా తను ఏఐకి సంబంధించిన కొన్ని విషయాలు మనలాంటి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా ‘ఆర్ యూ బోర్న్ విత్ ఏఐ’ అనే పుస్తకాన్ని రాశాడు. మూడేళ్ల వయసులోనే అమ్మానాన్నల సాయంతో కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించాడు తను. అయిదేళ్లకు కోడింగ్ వన్ ఆన్ వన్ సెషన్‌లో పాల్గొని.. ఆపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్ నుంచే ఆహ్వానం అందుకున్నాడు. 2022లో ఒక గ్లోబల్ రీడింగ్ ఛాలెంజ్‌లో పాల్గొని ‘సూపర్ ప్రెజెంటర్’గా నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఆరేళ్ల వయసులో టెక్నాలజీ, ఆవిష్కరణల గురించి టెడ్‌ఎక్స్ వేదిక మీద మాట్లాడి ‘యంగెస్ట్ టెడ్‌ఎక్స్ స్పీకర్’గానూ



నిలిచాడు. అలాగే బెస్ట్ స్పీకర్‌గా ‘ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం సంపాదించుకున్నాడు దేవా. మరో విషయం ఏంటంటే.. మార్స్ మీద అన్వేషణ కోసం ఒక నమూనా రాకెట్‌షిప్‌ను తయారు చేసి, దానికి నాసాకు సంబంధించిన జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ నుంచి గుర్తింపు కూడా సాధించాడు. ప్రస్తుతం కొన్ని సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు దేవా. మరి మనమూ నచ్చిన అంశంలో పట్టు సాధించేలా కష్టపడదామా!

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...





కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 01 మార్చి 2026




## వైసీపీ ఎమ్మెల్సీలు సోముకు క్షమాపణ చెప్పాలి

### జిల్లా బిజెపి ఓబీసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో బిజెపి ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజుపై వైసిపి ఎమ్మెల్సీలు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేష్ యాదవ్‌ల దురుసు ప్రవర్తనను ఖండిస్తూ శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం బిజెపి జిల్లా ఒబిసి అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా సిద్ధాంత ప్రాతిపదికగా సుదీర్ఘంగా రాజకీయాల్లో పనిచేసిన పెద్ద వయసు చూడకుండా సోము వీర్రాజు లాంటి సీనియర్ నేతపై వైసీపీ ఎమ్మెల్సీలు అనుచితంగా ప్రవర్తించిన చర్య ను తీవ్రంగా ఖండించారు.దీనిపై సోము కు వైసీపీ నేత జగన్, ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా అవమానించారని పార్టీ శ్రేణుల నుంచి ఎదురయ్యే ప్రతిస్పందనకు వైసిపినే బాధ్యత వహించాలని అన్నారు.పెద్దల సభలో చర్చలతో ప్రజాస్వామ్య యుతంగా జరగాల్సిన ప్రక్రియను వైసీపీ దిగజార్చిందన్నారు. వైసీపీ హయాంలో శాసన సభల్లో అరాచకం సాగిందని ఇప్పుడు కూడా తీరు మార్చుకోకపోతే ప్రజలకు శాశ్వతంగా దూరం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.బిజెపి సీనియర్ నాయకుడు, అడబాల రామకృష్ణరావు మాట్లాడుతూ, తిరుమల లడ్డు కల్తీ చేయడం, దేవాలయాల్లో ఇచ్చే తీర్థాన్ని పారబోయడం వంటి చర్యలతో హిందువుల మనోభావాల ను దెబ్బతీశారని మండిపడ్డారు. వైసిపి ఎమ్మెల్సీల ప్రవర్తనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోకవరం బస్టాండ్ నుంచి ప్రదర్శనగా దేవి చౌక్, కంబాల చెరువు మీదుగా వివేకానంద విగ్రహం వద్ద ఉన్న దండి మార్చ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు యానాపు ఏసు, లలిత కుమార్ జైన్, కమిడీ మురళీకృష్ణ, పడాల నాగరాజు, ముగ్గల శ్రీనివాసు పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక నిరుపేద కుటుంబానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న స్థానిక 30వ డివిజన్ చర్చిపేటకు చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త ఈతలపాక డేవిడ్ రాజు ఆర్థికంగా ఇబ్బందిపడుతూ కుటుంబ పోషణ సక్రమంగా జరగడం లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సదరు కుటుంబ అవసరాల కోసం ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పేదలను ఆదుకోవడం మనస్సుకు చాలా ఆనందంగా ఉందన్నారు. కష్టాల్లో ఉన్న ఇటువంటి పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదలకు ఆర్థికంగా, సామాజికంగా సహాయ సహకారాలు అందించేందుకే తమ భవానీ చారిటబుల్ ట్రస్టును స్థాపించినట్లు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులు నిమిత్తం ఫీజులు చెల్లించడం, పేదలకు ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. సహాయం అంటూ తమ వద్దకు వచ్చిన వారికి మాత్రమే కాకుండా తమ కూటమి నాయకులు, కార్యకర్తల ద్వారా కష్టాల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకుని కూడా తమ ట్రస్టు తరపున సహకారం అందిస్తున్నామన్నారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము చేసే సేవా కార్యక్రమాలు మాత్రం నిలిచిపోవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల రమణ, మాలే విజయలక్ష్మి, ద్వారా పార్వతి సుందరి, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, చాపల చిన్నరాజు, చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు అభివృద్ధికి కృషి చేస్తాయి

### – ఘనంగా ఉద్యమిత వికాస్ 3.0



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిత్య బిజినెస్ స్కూల్ బిబిఏ బిజినెస్ అనలిటిక్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఒక్కరోజు బజారు ఉద్యమిత వికాస్ 3.0 పేరిట కళాశాలలో నిర్వహించారని విద్యార్థుల భవిష్యత్తుకు అభివృద్ధికి కృషి చేస్తాయి అని కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ సిహెచ్ ఫణి కుమార్, డి రామకృష్ణ ,రెహమాన్ , ఆర్ చంద్రశేఖర్, కె.వి శ్రీరామ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి వారికి తగిన సూచనలను అందించి భవిష్యత్తులో వ్యాపార సంస్థలను స్థాపించి దేశ సమగ్ర అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, ప్రత్యేక అతిథులుగా కంఠమణి కాశీ విశ్వేశ్వరరావు, బెంగళూరు ప్రముఖ వ్యాపారవేత్త మనోజ్ జయంత్ రెడ్డి విచ్చేశారు. అతిథులు విద్యార్థులకు వారు స్టాల్ ను ఏర్పాటు చేసినటువంటి ఉద్దేశమును అలాగే వారు ముడి సరుకు ఎక్కడనుంచి కొనుగోలు చేశారు వాటి ద్వారా అప్పటికప్పుడే ఉత్పత్తులను తయారు చేసి ఏ విధంగా అమ్ముతున్నారు వాటికి సంబంధించినటువంటి ఆర్థిక మరియు ఉత్పత్తి విషయాలకు సంబంధించి ప్రశ్నలను అడగడం, విద్యార్థులు వాటికి తగిన సమాధానాలు ఇవ్వడం జరిగింది. అలాగే వారు భవిష్యత్తులో మంచి స్థాయిలో వ్యాపారవేత్తలుగా రాణించాలని వారిని ఆశీర్వదించారు. ఉద్యమిత వికాస్ కోఆర్డినేటర్ పి విజయ్ దేవన్ మరియు వైస్ ప్రిన్సిపాల్ ఆర్ వి సుబ్బారావు, హెచ్ ఓ డి కే రాజు, ఎన్ ఎస్ ఎస్ డైరెక్టర్ డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు స్టాల్స్ సందర్శించి విద్యార్థులకు తగిన సూచనలను అందించారు. ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులందరూ ఈ స్టాల్స్ ను సందర్శించారని, ఇంత గొప్ప ప్రోగ్రాంను నిర్వహించిన ఆదిత్య బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డి రామకృష్ణని మరియు అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు అభినందించి భవిష్యత్తులో మరిన్ని ప్రోగ్రామ్స్ను చేయించాలని తద్వారా విద్యార్థులు అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.

## కులాంతర వివాహమే హత్యకు ప్రేరేపణ

### పోలీసుల అదుపులో నిందితులు : డీఎస్పీ విద్య



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కులాంతర వివాహమే మండపేట మండలం ద్వారపూడిలో జరిగిన హత్యకు కారణం అని రాజమండ్రి ఈస్ట్ జోన్ డిఎస్పి బి.విద్య తెలిపారు. ఇటీవల ఉభయగోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన ద్వారపూడి హత్య కేసు కు సంబంధించిన వివరాలను శనివారం మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించారు. రాయవరం డిప్యూటీ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న సంధ్య, ద్వారపూడి బట్టల వ్యాపారి పోలిపల్లి వీర వెంకట సూర్య ప్రకాశరావు, గత కొంతకాలంగా ప్రేమించుకుని పెళ్లి చేసుకోగా అదే రోజు అమ్మాయి తరపు అన్నదమ్ములు అబ్బాయిని హత్య చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ హత్యకు కులాలే ప్రధాన కారణమని ఒక పథకం ప్రకారమే ఇంటికి వెళ్లి బండరాయితో అతి కిరాతకంగా కొట్టి అబ్బాయిని హత్య చేశారని తెలిపారు. హత్య జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ దొరరాజును, ఎస్ఐ కిషోర్ ను డిఎస్పి అభినందించారు. కాగా శనివారం ముద్దాయిలు అయినవిల్లి చంద్రపాల్, అయినవిల్లి గిరిబాబు లను కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## జ్ఞాననిధిలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల జ్ఞాననిధి విద్యానికేతన్ పాఠశాలలో ప్రతీ సంవత్సరం నిర్వహించినట్లుగానే ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నందుకు గుర్తుగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు సైన్స్, గణిత, సాంఘిక, సామాజిక, జీవ శాస్త్రలపై పలు ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. ప్రతీ ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. విద్యార్థులకు విద్యా పట్ల గల ఆసక్తి, అవగాహన, విశ్లేషణ చూపరులను ఆకర్షించాయి. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా విద్యను అందించడంలో ఉపాధ్యాయులు చూపించిన బోధన నైపుణ్యం విద్యార్థులలో కొట్టొచ్చి నట్టు కనిపించింది. పాఠశాల కరస్పాండెంట్ దాసరి ప్రసన్న లక్ష్మి, ప్రిన్సిపాల్ దాసరి మంగరాజు పర్యవేక్షణలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు అందచేశారు. సైన్స్, మాథ్స్, సోషల్ టీచర్స్ ను శాలువా కప్పి మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, విజయ్, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ కె. వి. వి. ఎస్. ప్రసాద్, హెచ్. ఎం లు ఫణి, డేవిడ్ రాజు, కల్చరల్ ఆర్గనైజర్ విల్సన్, ఉపాధ్యాయులు కిషోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను చూసి విద్యార్థుల తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## కుల వివక్ష, పరువు హత్యలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలి

### రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛతో ప్రేమ వివాహం చేసుకున్న మేజర్ జంటపై దాడి అమానుషం

### నిందితులను కఠినంగా శిక్షించాలి – ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిలక్ష్మి డిమాండ్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రేమ వివాహం చేసుకున్నారనే నెపంతో ప్రాణాలు తీయడం అమానుషమని ఐద్వా జిల్లా కార్యదర్శి డి. ఆదిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా, మండపేట మండలం, వేములపల్లి గ్రామంలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న సూర్య ప్రకాష్ అనే యువకుడిని, యువతి సోదరులు అత్యంత కిరాతకంగా రాళ్లతో కొట్టి చంపడం నాగరిక సమాజం తలదించుకోవలసిన సంఘటన అని శనివారం రాయవరం లో ఆమె ఖండించారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛతో ప్రేమ వివాహం చేసుకున్న మేజర్ జంటను ఆదరించక పోగా, ఇలాంటి దాడులకు పాల్పడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. రాయవరం మండలంలో డిప్యూటీ తహశీల్దార్ గా బాధ్యతాయుతమైన స్థాయిలో ఉన్న మహిళా అధికారిని, ఆమె భర్తను లక్ష్యంగా చేసుకుని ఈ దాడికి పాల్పడడం గమనిస్తే, కరుడుగట్టిన మనస్తత్వంతో వ్యవహరించిన నిందితులకు చట్టం పట్ల భయంలేదని స్పష్టం అవుతుందన్నారు. నేరానికి పాల్పడిన యువతి సోదరులతో పాటు వారికి సహకరించిన వ్యక్తులపై కఠినమైన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. సూర్య ప్రకాష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ప్రాణహాని ఉన్న డిప్యూటీ తహశీల్దార్ సంధ్యకు పోలీసులు తక్షణమే రక్షణ కల్పించాలని సూచించారు. కులవివక్ష పరువు హత్యలపై ఉక్కు పాదం మోపి, ఇలాంటి ఉన్మాద చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వెట్లపాలెం ఘటన అత్యంత విషాదకరం

### ప్రభుత్వం అందరిని ఆదుకుంటుంది : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వెట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, అందరిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘటనా స్థలికి చేరుకుని బాధితులను పరామర్శించడం జరిగిందని, ఆయన ఆదేశాలు మేరకు క్షతగాత్రులు అందరికీ మెరుగైన వైద్య సహాయం అందుతుందని వేగుళ్ళ ధీమా వ్యక్తం చేశారు.

### దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం, అధికారిక జయంతికి

## చంద్రబాబుకి వినతిపత్రం అందజేసిన కుడుపూడి




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఈరోజు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి, శెట్టిబలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి గౌరవార్థం పలు కీలక అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.గత ఫిబ్రవరి 23, 2026న తన అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ కార్పొరేషన్ 3వ పాలకమండలి సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన సత్తిబాబు, అమలాపురం సమీపంలోని బోడసకుర్రు గ్రామంలో దొమ్మేటి వెంకటరెడ్డి జన్మించిన ప్రదేశంలో ప్రభుత్వం తరపున 15 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బోడసకుర్రు వద్ద నిర్మించిన బ్రిడ్జికి "స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి వారధి"గా నామకరణం చేయాలని, ప్రతి సంవత్సరం మార్చి 23వ తేదీన ఆయన జయంతిని ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించేలా తక్షణమే జీవో జారీ చేయాలని కోరారు.1920వ దశకంలోనే శెట్టిబలిజ సంఘాన్ని స్థాపించి సామాజిక చైతన్యానికి పునాది వేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను ప్రభుత్వం గుర్తించడం ద్వారా మొత్తం సామాజిక వర్గానికి గౌరవం దక్కుతుందని సత్తిబాబు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ భేటీలో కార్పొరేషన్ ప్రతినిధులు మరియు ఇతర నాయకులు పాల్గొనగా, వినతిపత్రంలోని అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

### కోనసీమ జిల్లాలో ఘనంగా పోలీస్ అధికారుల

## పదవీ విరమణ వేడుక

### ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై, సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఎస్.ఐ. నూకల నాగేశ్వరరావు (ఎస్ ఐ 445), ఎస్.ఐ. ఎస్. వెంకటేశ్వరరావు (ఎస్ ఐ 722)లను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో సుమారు 42 సంవత్సరాలకు పైగా అంకితభావంతో పనిచేసి, నిష్కళంక సేవా రికార్డుతో పదవీ విరమణ చేయడం అభినందనీయమని కొనియాడారు. నూకల నాగేశ్వరరావు 1983 మార్చి 31న కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి, 26 సంవత్సరాలు కానిస్టేబుల్‌గా, 3 సంవత్సరాలు హెడ్ కానిస్టేబుల్‌గా, 7 సంవత్సరాలు ఏఎస్సైగా సేవలందించారు. ప్రస్తుతం డీసీఆర్‌బీ కోర్టు మానిటరింగ్ సెల్‌లో ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు. వీరి సేవలకు గుర్తింపుగా 2024లో 'సేవా పతకం' లభించింది. ఎస్. వెంకటేశ్వరరావు 1989 మే 10న విధుల్లో చేరి, వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం సేవలందించి ప్రస్తుతం డీఎస్‌బీ (ద్రాక్షారామ పీఎస్‌కు అనుబంధంగా)లో ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు. వీరు 2022లో 'సేవా పతకం' అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బారాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ, పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎస్పీ రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు.

## బాణాసంచా దుర్ఘటన దురదృష్టకరం

### మృతులకు 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** సామర్లకోట మండలం వేట్లపాలెంలో చోటుచేసుకున్న బాణాసంచా దుర్ఘటన దురదృష్టకరమని రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వం రూ 50 లక్షలు ఎక్స్గ్రేషియో చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 18 మంది మృతితో పాటు చాలామంది కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరికి మెరుగైన వైద్య సాయం అందించాలని ఆయన కోరారు. ఇదే రీతిలో ఇటీవల రాయవరం మండలం కొమరపాలెంలో ఇటువంటి సంఘటన జరిగిందన్నారు. ఆ ఘటన లో పదిమంది వరకు మృతి చెందారన్నారు. తిరిగి అదే తరహా ప్రమాదం చోటుచేసుకుందని దీనిపై ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం బాణాసంచా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారా లేదా అని తెలుసుకునే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. గతంలో కొమరిపాలెం ఘటనపై అమరావతి నుంచి రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యదర్శి స్థాయి కమిటీ వచ్చి విచారణ చేసి వెళ్లారన్నారు. అనంతరం తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పలేదన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఏమిటని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఎటువంటి ఘటన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం అసమర్థత అని పేర్కొన్నారు. రాయవరం ఘటన అనంతరం ఎటువంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు. ఈ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిస్తుందని దుయ్యబట్టారు. బాణసంచా కర్మాగారాలు లో ఎటువంటి నిబంధనలు పాటించాలని ఆదేశాలు ఇచ్చారో తెలపాలని పేర్కొన్నారు. రాయవరం మండలం కొమరిపాలెం సంఘటన అనంతరం అమరావతి నుంచి వచ్చిన కమిటీ ముందు తాము వాదనలు వినిపించామని చెప్పారు. అయితే కమిటీ భవిష్యత్తులో ఎటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారని చెప్పారు. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారా లేదా ఇస్తే వాటి మీద తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. మరో సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. పోలవరం అమరావతి పైనే దృష్టి పెడుతున్నారని దీనిపై ఉన్న శ్రద్ధ పరిపాలన పై పెట్టాలని సూచించారు. పరిపాలనను గాలికి వదిలేసారని విమర్శలు చేశారు. శ్రీకాకుళం లో ఆహార కల్తీ తో ప్రజలు చనిపోయారన్నారు. కల్తీ పాలు తాగి రాజమహేంద్రవరంలో పలువురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు డైరీ పాలు తాగాలంటే భయంగా ఉందని పేర్కొన్నారు. ఇపుడు బాణాసంచా దుర్ఘటన లో మృతుల కుటుంబాలకు రూ 50 లక్షలు తక్కువ కాకుండా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల పిల్లలకు చదువుకొని ఉంటే విద్యార్హతలు అనుసరించి వారికి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి హయాంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు కోటి రూపాయలు ఒక్క కుటుంబానికి అందజేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పలివెల సుధాకర్,పిల్లా వీరబాబు, యారమాటీ వెంకన్న బాబు, వణుమ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చింతా శివ గోపాల్ సీనియర్ సహాయకులుగా పదవీ విరమణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సీనియర్ సహాయకులుగా చింతా శివ గోపాల్ ఉద్యోగ విధులను నిర్వహించి విరమణ పొందారు. ఈ నేపథ్యంలోనే ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న,డిప్యూటీ ఎంపీడీవో మూర్తి,ఏవో సుబ్రహ్మణ్యం,జూనియర్ అసిస్టెంట్ సుమతి, టైపిస్టు సుందరపల్లి సతీష్,ఎమ్ ఎల్ సి ఓ చిలకల జగదీష్,పలువురు పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు శాలువాలతో, పూలమాలతో,ఫ్రూట్స్ అందజేసి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోత్స్న శివ గోపాల్ విధి నిర్వహణలో చూపిన అంకిత భావం నిజాయితీపట్ల మాట్లాడుతూ స్నేహశీలి,మృదుస్వభావి సీతానగరంలో టైపిస్టుగా తన ఉద్యోగాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి సీనియర్ సహాయకులుగా పనిచేసి ఉన్నతాధికారుల, ప్రజల ఆదరాభిమానాలను పొంది విధి నిర్వహణ ధర్మాన్ని ఎక్కడా తూచా తప్పకుండా ఎలాంటి ప్రలోభాలకు తలవంచకుండా విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురైనా చిరునవ్వుతో తన ధర్మాన్ని పాటించి ఆయన వ్యక్తిత్వంలో వృత్తికే వన్నెతెచ్చిన మంచి వ్యక్తి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఎప్పుడో ఒకసారి పదవి విరమణ తీసుకోవాల్సి ఉంటుందని ఏవో సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. శివ గోపాల్ ఉద్యోగ విధి నిర్వహణలో ఎప్పుడూ ప్రజల,అధికారుల ఆదరాభిమానాలను పొందారని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేశారు. 2005 సంవత్సరంలో తన ఉద్యోగాన్ని ప్రారంభించి 21 సంవత్సరాల కాలం దిగ్విజయంగా అలసట లేకుండా ఉద్యోగ ధర్మాన్ని పాటించారని పలువురు అన్నారు. కాకినాడ జిల్లాలో,రాజానగరం మండలం,గోకవరం మండలం,సీతానగరం మండలంలో విధులను నిర్వహించి నేడు పదవీ విరమణ పొందిన శివ గోపాల్ కు ఎంపీడీవో ఎం భారతి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## లిటిల్ ఏంజెల్ స్కూల్లో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్ ఉత్సవాలు



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో మంచి గుర్తింపు పొందిన లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ (విజ్ఞాన ప్రదర్శన) నిర్వహించడం అనేది విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే అద్భుతమైన సందర్భం. ఇలాంటి వేడుకలు సాధారణంగా చాలా ఉత్సాహంగా సాగుతుంటాయి. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో చిన్న తరగతుల నుంచి హైస్కూల్ విద్యార్థుల వరకు రకరకాల ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ: కాలుష్య నివారణ, మొక్కల పెంపకం, నమూనాలు చంద్రయాన్, సోలార్ సిస్టమ్, మరియు స్మార్ట్ సిటీ నమూనాలు, సైన్స్ ప్రయోగాలు: విద్యుత్ ఉత్పత్తి, వర్షపు నీటి నిల్వ , మరియు రోబోటిక్స్. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు లేదా విద్యావేత్తలు హాజరవుతుంటారు. వారు విద్యార్థులను ఉద్దేశించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రయోగాత్మక విద్యపై దృష్టి పెట్టాలని సూచిస్తుంటారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల ఉత్సాహం తమ పిల్లలు చేసిన ప్రయోగాలను చూసి తల్లిదండ్రులు ఎంతో గర్వపడుతుంటారు. గ్రామీణ ప్రాంతమైన పి. గన్నవరంలో ఇటువంటి ఆధునిక విద్యా విధానాలు అమలు చేయడం ఆ పాఠశాల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

ఆదివారం, 01 మార్చి 2026
www.viswamvoice.com





మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు

# తైలాభిషేకములు ఆదాయం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం19 ×700/- = 13,300/- ఏకాదశ రుద్ర తైలాభిషేకం 220× 250/- =55000/- మహాన్యాస పూర్వక తైలాభిషేకం 268 × 175/- =46,900 /- తైలం సమర్పించి దర్శనం. 180× 80/- =14,400 /-, తిలదానం 5× 50/- = 250 /-స్వయం హోమం, 2× 800/- = 1600/- మహాన్యాస పూర్వక తైలాభిషేకం(పరోక్ష)1× 400/- = 400/ మొత్తం రూ 131,850/-మరియు అన్నప్రసాదం విరాళాలు రూ.25394 /-పరోక్ష పూజలు ద్వారా రూ.102,800/- మొత్తం రూ.2,60,044 /-లు ఆదాయం వచ్చినదని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

వృద్ధులు వితంతువులు వికలాంగులకు

# భరోసా కల్పిస్తున్న ఎన్టీఆర్ పెన్షన్

గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పెన్షన్ పంపిణీలో ప్రభుత్వం పారదర్శకత ఏ ఆధారం లేని నిరుపేద వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాలకు ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కల్పిస్తుందని సీనియార్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి అన్నారు.ప్రతి నెల కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ పింఛను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుమేరకు లబ్ధిదారులకు సచివాలయం సిబ్బందితో కలిసి అందించడం జరుగుతుందని గుబ్బల మూర్తి తెలియజేశారు. ప్రభుత్వం పారదర్శకత పాటిస్తూ సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పింఛను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నేరుగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా నేరుగా అందించడం వలన లబ్ధిదారులను కలుసుకునే అవకాశం కలుగుతుందని తద్వారా వారి యొక్క సమస్యలను తెలుసుకుని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కు తెలియజేసి వారి ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తూ తెల్లవారి జామునే పింఛను దారులకు పింఛను అందించడంతో లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మేలు చేసేందుకు గాను కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఈ సందర్భంగా గుబ్బల మూర్తి తెలియజేశారు.

# ఘనంగా టైలర్స్ డే దినోత్సవం

సీనియర్ టైలర్లను సన్మానించిన బుల్లియ్య



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పుల్లేటికుర్రులో శ్రీనివాస టైలర్ అసోసియన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు శనివారం అంబాజీపేట మండలంలో ఆయాచోట్ల ఘనంగా నిర్వహించారు. అంబాజీపేటలో బస్టాండ్ ఎదురుగా ఉన్నసిటీ టైలర్స్ ఆధ్వర్యంలో మట్టపర్తి రాంబాబు టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుల్లేటికుర్రు చౌరస్తాలో టైలర్ సంఘం అధ్యక్షులు బొక్క రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లయ్య ఘనంగా టైలర్లకు ఘనంగా ఆయన నివాస గృహంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టైలర్ సంఘం ప్రెసిడెంట్ బొక్కా రామకృష్ణ ప్రధాన కార్యదర్శి చింతా నాగార్జున, సీనియర్ టైలర్స్ ఇళ్ల సుబ్బారావుని, టైలర్ రాయుడు సత్యనారాయణని ఘనంగా సన్మానించిన ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజు టైలర్ కుందం రాజు యనమల ఏడుకొండలు, గుత్తుల శ్రీనివాస్ రావు కుమార్ టైలర్స్ దొమ్మేటి శీను పాల్గొన్నారు. టైలర్స్ అందరికీ వక్కలంక బుల్లయ్య దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది.

# రావులపాలెంలో టైలర్స్ డే సంబరాలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జరిగిన టైలర్స్ డే వేడుకలు.ఈ కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అధ్యక్షులు జక్కంశెట్టి స్వామి జిల్లా గౌరవాధ్యక్షులు పోలవరపు త్రిమూర్తులు జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగ సత్యనారాయణ మూర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలు గొలుగూరు వసంత లక్ష్మి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కడలి వెంకటేశ్వరరావు జిల్లా సలహా మండల వైస్ చైర్మన్ పి అమ్మా రావు మండల ట్రెజరర్ గెద్దాడ తాతారావు ఈ కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారని తెలియజేసారు.

నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు

# రూ.18.26 కోట్ల పంపిణీ : కొత్తపేట ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల సేవలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రధాని మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రావులపాలెం మండలం రావులపాడులో శనివారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు చెందిన 42వేల మందికి రూ.18.26కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. రూ.4వేలు పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు అందిస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని అన్నారు. ఈనాడు పింఛన్లు అందుకున్న ప్రతీ ఒక్కరి కళ్లలో ఆనందం కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లను పెంచడం జరిగిందన్నారు. రూ.3వేల పింఛను రూ.4వేలకు జరిగిందన్నారు. దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ పెంచిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రియదర్శినీ బాలవిహార్‌లో

# ఘనంగా 40వ వైజ్ఞానిక ప్రదర్శన



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియదర్శిని బాలవిహార్ లో ఈరోజు 40వ జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం ఎంతో ఘనంగా జరిగింది అసెంబ్లీలో అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలనం చేసారు. ప్రధమస్థానాలలో నిలిచిన 13 మంది విద్యార్థినీ విద్యార్థులు భారతీయ శాస్త్రవేత్తల చిత్రపటాలను ప్రదర్శించారు. ఐదారు తరగతుల పిల్లలు "ఇవే ఇవే వందనాలు మేధావులకు" గీతాన్ని, ఏడవ తరగతి పిల్లలు "సైన్సేరా జగతికి మూలం" గీతాన్ని ఆలపించారు. పాఠశాలలో 2వ తరగతి నుండి 9వ తరగతి వరకు సుమారు 80కి పైగా శాస్త్ర సాంకేతిక అంశాలను ప్రదర్శించారు. అనేక చార్టులు మోడల్స్ తో బాటు, పనిచేసే మోడల్స్ కూడా వీటిలో చోటు చేసుకున్నాయి. భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం, రసాయన శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఖగోళ అంతరిక్ష శాస్త్రం, గణిత శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం & రవాణా, వినోదం కోసం విజ్ఞానం, అనే 8 విభాగాలతో ఈ విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. భౌతిక శాస్త్ర విభాగంలో రంగుల ప్రపంచం ప్రాజెక్ట్‌లో కాంతి విక్షేపణ, ప్రిజం ద్వారా ఏర్పడే వర్ణపటలం వంటి అంశాలను చూపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. శక్తి ఉత్పత్తి మరియు వినియోగం, గాలి శక్తి, నీటి శక్తి వంటి అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గాలి మర నమూనా, జల విద్యుత్ ఉత్పత్తి విధానం, శక్తి సంరక్షణ పద్ధతులు విద్యార్థులు స్పష్టంగా వివరించారు.పర్యావరణ శాస్త్ర విభాగంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఆధునిక సాగు పద్ధతులు, నీటి పారుదల విధానాలు, సేంద్రీయ వ్యవసాయం నమూనాలు ప్రదర్శించారు. అంతరించిపోతున్న జాతుల సంరక్షణ, అడవుల సంరక్షణ పై అవగాహన కలిగించే నమూనాలు కూడా ఏర్పాటు చేసారు.జీవ శాస్త్ర విభాగంలో మానవ శరీర భాగాల వివరణకు సంబంధించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుండె, ఊపిరితిత్తులు, మెదడు, కిడ్నీ వంటి అవయవాల నిర్మాణం మరియు వాటి పనితీరును విద్యార్థులు స్పష్టంగా వివరించారు. అదేవిధంగా, మొక్కల భాగాలు, వాటి పనులు మరియు మొక్కల పెంపకం విధానాలపై రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఖగోళ,అంతరిక్ష శాస్త్ర విభాగంలో రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సౌర కుటుంబం, రాత్రి పగలు,నక్షత్రాల పరిణామ క్రమం విద్యార్థులు చార్ట్‌లు మరియు నమూనాల ద్వారా వివరించారు. రసాయన శాస్త్ర విభాగంలో "స్టార్చ్ పరీక్ష" ఆహార పదార్థాల్లో పిండి పదార్థం ఉందో లేదో గుర్తించే విధానం, "ఫైర్ ఎక్స్‌టింగ్విషర్" నమూనా ద్వారా అగ్ని ప్రమాదాల సమయంలో ఉపయోగించే పరికరాల పని విధానాన్ని వివరించి చూపారు.గణిత శాస్త్ర విభాగంలో గణితం చరిత్రపై రూపొందించిన చార్ట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేపియర్ బోన్స్, అబాకస్ ద్వారా వేగవంతమైన లెక్కలు చూపించారు. టాంగ్రామ్ పజిల్, జ్యామితీయ ఆకారాలు, భిన్నాలపై రూపొందించిన ప్రాజెక్టులు విద్యార్థుల గణన మరియు విశ్లేషణాత్మక ప్రతిభను ప్రతిబింబించాయి. సాంఘిక శాస్త్రం విభాగంలో విద్యార్థులు "ఆర్థిక వ్యవస్థలో రంగాలు" మరియు "వాతావరణ కాలుష్యం" అనే అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఫెయిర్‌లో ఆప్టికల్ పరికరాల ప్రదర్శన ఆకట్టుకుంది. టెలిస్కోప్, మైక్రోస్కోప్ ద్వారా దూర మరియు సూక్ష్మ వస్తువులను చూడడం, పెరిస్కోప్ ద్వారా అడ్డంకుల మీదుగా చూడడం విద్యార్థులు చూపించారు. కేలిడోస్కోప్‌లో రంగుల ప్రతిబింబాలు, బైనాక్యులర్స్ ద్వారా దూర దృశ్యాల వీక్షణను సులభంగా వివరించారు. ప్రైమరీ పిల్లలు రవాణా రకాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. భూమి, జల మరియు వాయు రవాణా విధానాలను చిన్నారులు నమూనాలతో వివరించారు. టెలిఫోన్ పని విధానం మరియు సమాచార ప్రసారంలో దాని ప్రాధాన్యతను సులభంగా అర్థమయ్యేలా వివరిస్తూ తమ ప్రతిభను చాటిచెప్పారు.వినోదం కోసం విజ్ఞానం విభాగంలో లిసాజస్ పిక్చర్స్, బజ్జింగ్ వైర్ గేమ్, హైడ్రాలిక్ లిఫ్ట్, పిన్ హోల్ కెమెరా నమూనాలు ఆకట్టుకున్నాయి. ఎలక్ట్రిక్ బెల్, వాక్యూమ్ క్లీనర్ పని విధానాన్ని చూపించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో కృషి చేసిన బయాలజీ టీచర్ కె. అనూష, మ్యాథ్స్ టీచర్ ఐ. ఇందు భార్గవి, ఫిజిక్స్ టీచర్ ఎ. సాహిత్య, ఈవీఎస్ టీచర్ వై. ధనలక్ష్మి, సోషల్ స్టడీస్ టీచర్ ఎ. ఎస్. ఆర్ మూర్తి, హిందీ టీచర్ పి. సత్యవేణి లకు కరస్పాండెంట్ ఎ. బి. సి. దేవ్ అభినందనలు మరియు ఎన్నో సైన్స్ అంశాలను చక్కటి క్రమశిక్షణతో ప్రదర్శించిన చిన్నారులకు ఆశీస్సులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ప్రదర్శనను ఆసాంతం తిలకించరు చిన్నారులను ఆశీర్వదించారు.

# రూ.46.85 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత – కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం వేగాయమ్మపేట గ్రామంలో రూ.46.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న కల్వర్టులు, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు సిమెంట్ కాంక్రీట్ రోడ్ల అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామాల్లో వర్షాకాలంలో నీరు నిల్వ సమస్యలు లేకుండా కల్వర్టులు, డ్రైనేజ్ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని, అంతర్గత వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణంతో రాకపోకలు సౌకర్యవంతం అవుతాయని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు సమానంగా చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాల మేరకు మరిన్ని పనులు తీసుకొస్తామని తెలిపారు. వేగాయమ్మపేట గ్రామంలోని అరుందతిపేట, రామారావుపేట ప్రాంతాల్లో కల్వర్టులు, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు, సిసి రోడ్ల నిర్మాణ పనులు ఈ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల భివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, అధికారులు, కూటమి పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పి.గన్నవరంలో ఘనంగా ప్రపంచ టైలర్స్ డే నిర్వహించిన దర్జీలు




**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం శ్రీ బాలగణపతి టైలర్స్ యూనియన్ మండల అధ్యక్షులు చొల్లంగి నాగరాజు ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు స్థానిక డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్ వద్ద గల కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హెవే విగ్రహానికి పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టైలర్ల వృత్తి సమాజలో గౌరవపదమైన కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టైలర్లకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఎండి రిజ్వి, చిల్లే రమేష్, టైలర్స్ యూనియన్ నాయకులు కుడిపూడి సత్యనారాయణ, దొమ్మేటి సత్యనారాయణ, గిడ్ల చందు, షేక్ సత్తార్, పొలమూరి బాబురావు, బొక్క ఈశ్వరరావు, పిల్లి రాంబాబు, కుడిపూడి శ్రీను, నాగమణి, ఇందిరా కుమారి, దివ్య, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవలో

# ఎన్డీయే కూటమి ప్రభుత్వం

నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.18.26కోట్ల పంపిణీ

కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రావులపాలెం మండలం రావులపాడులో శనివారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు చెందిన 42వేల మందికి రూ.18.26కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. రూ.4వేలు పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు అందిస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని అన్నారు. ఈనాడు పింఛన్లు అందుకున్న ప్రతీ ఒక్కరి కళ్లలో ఆనందం కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లను పెంచడం జరిగిందన్నారు. రూ.3వేల పింఛను రూ.4వేలకు జరిగిందన్నారు. దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ పెంచిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# శాసనమండలి చైర్మన్‌కు కరాటం వినతిపత్రం

డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్‌లను రెగ్యులర్ చేయాలని వినతి



**అమలాపురం రూరల్, విశ్వం వాయస్ న్యూస్ :** డిగ్రీ కళాశాలలో అన్‌ఎయిడెడ్ లెక్చరర్ లగా పని చేస్తున్నవారినీ రెగ్యులరైజ్ చేయాలనీ ఉపాధ్యాయ జెఏసి రాష్ట్ర కార్యదర్శి కరాటం ప్రవీణ్ ఉపాధ్యక్షులు టి.సుందర రామయ్య శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు శాసనమండలి చైర్మన్ మోసస్ రాజుకు వినతిపత్రం అందజేశారు హైకోర్టు తీర్పు ప్రకారం దీనిపై త్వరతిగతిన స్పదించాలని కోరారు.



కొత్తపేట శ్రీ మందేశ్వర (శనీశ్వర)స్వామి వారిని దర్శించుకున్న నూతన హీరో శ్రీనివాస్, రాజీవ్ కనకాల ఆలయ మర్యాదలతో సత్కరించిన దారపు రెడ్డి సురేష్ బాబు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు అధిక సంఖ్యలో చేయాలి : ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం (ఉద్యమి) నమోదు కార్యక్రమంపై విస్తృత అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ "జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ బలోపేతానికి కీలకమైన అడుగు. ప్రతి గ్రామంలో పార్టీ స్థాయిని మరింత బలంగా నిలబెట్టాలి. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై, పార్టీ విధానాలు మరియు సంకల్పాలను వివరించి అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయించాలి. పార్టీ బలపడితే ప్రజల స్వరానికి మరింత బలం చేకూరుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మడు తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శులు కుమార్. మద్ద చంటిబాబు. నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి. పి గన్నవరం మండల పరిషత్ అధ్యక్షురాలు గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్. గిడ్డి ఆనంద్. పి గన్నవరం మండల అధ్యక్షులు సాధనాల శ్రీ వెంకట సత్యనారాయణ. అంబాజీపేట మండల అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ. తాటికాయల శ్రీనివాస్. తాటికాయల వెంకటేష్. అన్నాబత్తుల అను బాబు. షేక్ దొరబాబు. తానంకి నాగరాజు. పత్తి దత్తుడు. మైపాల తాతాజీ. పోలిశెట్టి రాజేష్. పెనమరెడ్డి రెడ్డి వెంకటరత్నం నాయుడు. నగరం మార్కెట్ డైరెక్టర్ కందిపోటి సత్య ఈశ్వరి. గడసాలదీపిక. నల్ల గాయత్రి. ఆదిమూలం వెంకన్న. యర్రంశెట్టి తాతకాపు. యల్లమెల్లి చిట్టిబాబు. చిల్లే రమేష్ చిల్లే ప్రసన్న, పి. గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో నాయకులు ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు (సాధక్), వీరమహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతకు రిఫరల్ అధిక ప్రాధాన్యం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, అధునాతన, సృజనాత్మక ఆలోచనలకు క్రియాశీలకంగా వాస్తవ రూపం ఇచ్చేందుకు రిఫరల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతీ సంవత్సరం విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనలతో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. ఇదే ఒరవడిలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయ్యమ్మపేటలోని రూరల్ ఇండియా సెల్ఫ్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిఫరల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్విస్ ఎమ్మాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మటీనా, బ్రూనో ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన సుమారు 500 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో రోబోట్స్, మోడల్ కార్లు, సోలార్, స్మార్ట్ విలేజ్ నమూనాలు, ప్రకృతి విపత్తుల హెచ్చరిక వ్యవస్థలు, సెక్యూరిటీ, ఫైర్ అలర్ట్ సిస్టమ్స్, చెట్ల సంరక్షణపై అవగాహన నమూనాలు, డీఎన్ఏ, బ్లడ్ టెస్ట్ మోడల్స్, గ్యాస్ డిటెక్టర్, ఆటోమేటిక్ ఇరిగేషన్ వ్యవస్థ

రిఫరల్ విద్యా సంస్థలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



వంటి వినూత్న ప్రాజెక్టులు ఆహూతులు, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఉపయోగించిన వృధా కాగితాలు, ఇతర వ్యర్థ పదార్థాలతో తయారు చేసిన సృజనాత్మక నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం నిర్వహించిన ముగింపు సభలో రిఫరల్ సంస్థ చైర్మన్, కరస్పాండెంట్ నికోడమస్ స్లెస్సర్ బాబు ముఖ్య వక్తగా ప్రసంగించారు. తమ రిఫరల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లోని విద్యార్థుల భవిష్యత్తు నైపుణ్యాభివృద్ధి, పరిశోధనా దృక్పథం, విజ్ఞానం విస్తరణ కోసం అవసరమైన అన్ని వసతులనూ సమకూరుస్తూ ఉన్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ప్రతిభ అపారం. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే వారు రేపటి శాస్త్రవేత్తలుగా నిలుస్తారని అన్నారు. అందుకే వీరిని ప్రోత్సాహించేందుకు, వీరికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు లక్షల రూపాయల వ్యయంతో "మేకర్స్ స్పేస్", హైటెక్ ల్యాబ్ ఏర్పాటు చేశాం అన్నారు. చిన్న కంప్యూటర్స్, సాఫ్ట్వేర్, 3డి ప్రింటింగ్, లేజర్ కట్టర్ మిల్లింగ్ యంత్రాలు, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి ఆవిష్కరణలు విద్యార్థుల్లోని విజ్ఞాన ప్రతిభను వెలికి తీశాయి అన్నారు. ఈ విద్యా సంస్థలోని విద్యార్థుల పిన్న వయస్సు నుంచే విజ్ఞాన విషయాల పట్ల ఆసక్తి పెంచాలనే సంకల్పంతో పాఠశాలలో ఎన్నో సంవత్సరాలుగా వివిధ విజ్ఞాన, శాస్త్రీయ విజ్ఞాన కార్యక్రమాలను చేపడుతున్నామని స్లెస్సర్ బాబు పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ...శాస్త్రీయ ఆలోచన, ఆవిష్కరణలు, స్థిర అభివృద్ధి దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపును ఇచ్చారు. కంప్యూటర్ విద్యతో పాటు స్కిల్ డెవలప్మెంట్, ప్రాజెక్ట్ ఆధారిత బోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలు, యోగ్యతా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్లు ఆర్.కేశవరావు, ప్రసాద్, కోఆర్డినేటర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు నరసింహారావు, సురేంద్ర, విద్యార్థుల తల్లి, దండ్రులు, పాల్గొన్నారు.

# ఒక్కరోజు ముందే పెన్షన్లను పంపిణీ చేసిన ప్రభుత్వం



**కాకినాడ రూరల్ (కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల సంక్షేమమే పరమావధిగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం దక్కాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన అందే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను, ఈసారి ఒక్కరోజు ముందుగానే లబ్ధిదారుల చెంతకు చేర్చింది. మార్చి 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం ఉదయమే పంపిణీ ప్రక్రియను ముమ్మరంగా ప్రారంభించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కరప, కాకినాడ రూరల్ మండలాల్లో ఈ పంపిణీ సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి మరీ పింఛన్ సొమ్మును అందజేశారు. కరపలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి దేవు వెంకన్న ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని వృద్ధులు, వితంతువులకు నేరుగా నగదును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తోందని కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ, ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్ మొత్తాన్ని ప్రతి నెలా ఠంచనుగా అందిస్తున్నామని స్పష్టం చేశారు. "అవ్వాతాతల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యం. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఈ పింఛన్ ఒక ఆర్థిక భరోసా మాత్రమే కాదు, వారు సమాజంలో గౌరవంగా బతికేలా చేసే ఆత్మవిశ్వాసం" అని వారు పేర్కొన్నారు. కొవ్వాడలో జరిగిన పంపిణీ కార్యక్రమంలోనూ లబ్ధిదారులు తమ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో పింఛన్ కోసం పడిగాపులు కాసే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి చొరవతో తమ కష్టాలు తీరాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి గంగాధర్, కోన వెంకటలక్ష్మి, కరెడ్ల సురేష్, పేపకాయలు సూరిబాబు, కమ్మ శ్రీను, కొవ్వాడ గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, దేంగేటి వెంకటరమణ, కాదా చిన్న, బోళ్ల సత్యనారాయణ, రాయుడు కామేష్, గుమ్మిడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపాలెం హైస్కూల్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనని ఘనంగా నిర్వహించారు. స్థానిక హెచ్ఎమ్ సుశీలమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారులు డేవిడ్, జాన్‌లు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను అధికారులు పరిశీలించి ప్రతిభగల విద్యార్థులను అభినందించారు. దీంట్లో భాగంగా విద్యార్థులకు ఎమ్ఈఓ డేవిడ్ మానవ శరీరంలో ఊపిరి తిత్తులు, గుండె పని తీరును లైవ్ స్పెసిమెన్ సహాయంతో వివరించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు గంగరాజు, అరుణ, శ్రీను బాబు ని అభినందించారు. అనంతరం ఎమ్ఈఓలను పాఠశాల హెచ్ఎమ్ సుశీలమణి ఇతర సిబ్బంది సత్కరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పి ప్రసన్నమౌనిక, నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివశంకర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు నక్క శ్రీను, అర్టోస్ చిన్నా, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ పలివెల రాజు, చిన్న, దీవెన వెంకన్నబాబు, పంచాయతి సెక్రటరీ సీహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో
# పాల్గొన్న కటకంశెట్టి బాబీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈరోజు కాకినాడ రూరల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కటకంశెట్టి (బాబి) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక తీసుకున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో 47 డివిజన్ సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులకు వితంతులకు వికలాంగులకు దీర్ఘకాలపు వ్యాధిగాస్తులకు డప్పు కళాకారులకు చేనేత కార్మికులకు ఉదయం 6 గంటల నుండి పెన్షన్ పంపిణీ కార్యక్రమం పాల్గొన్నారు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఫైనల్ సెల్ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్ జనసేన పార్టీ ఇంచార్జ్ మధు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వేట్లపాలెంలో బాణాసంచా కేంద్రంలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.తరచు బాణాసంచా తయారీ కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రాయవరం వేట్లపాలెం జూపాడు, వాకతిప్ప ఇటువంటి ప్రమాద సంఘటనలు జరిగి జరిగినాయి.ఈ తయారీ కేంద్రాలలో దళిత బలహీన వర్గాలకు చెందిన మహిళలు పిల్లలు పనిచేస్తున్నారని ఈ ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.వేట్లపాలెం లో జరిగిన ప్రమాద స్థలానికిసిపిఐ(యం, యల్) న్యూ డెమోక్రసీ గుబ్బలఆదినారాయణమూర్తి ఐఎఫ్టియు నాయకులు రాగుల రఘువులు పేలుడు జరిగిన ప్రాంతంలో సందర్శించారు.


























# 'బ్యాండ్ మేళం' అందరినీ నవ్విస్తుంది

**హీరోయిన్ శ్రీదేవి -'బ్యాండ్ మేళం' సినిమా అందరినీ అలరిస్తుంది - సౌకర్యాలు కల్పిస్తే సినీ హబ్‌గా మారుతుంది : కోన వెంకట్**
**గోదావరి ప్రాంతం సినిమా షూటింగులకు చాలా అనుకూలం - సినిమాలో చూపించాల్సిన లొకేషన్లు ఇక్కడ ఎన్నో ఉన్నాయి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతను ఆకట్టుకునే రొమాంటిక్ కామెడీ అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాలను జోడించిన 'బ్యాండ్ మేళం' చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ చెప్పారు. కోర్టు మూవీతో సంచలన విజయాన్ని అందుకున్న రోషన్, శ్రీదేవి జంటగా నటించిన 'బ్యాండ్ మేళం' సినిమా మార్చి 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తరుణంలో చిత్ర ప్రమోషన్‌లో భాగంగా స్థానిక దానవాయిపేటలోని అన్ లిమిటెడ్ హోటల్ లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కోన వెంకట్ మాట్లాడుతూ దర్శకుడు సతీష్ జవ్వాజి రాసుకున్న కథను వినిపించిన వెంటనే నచ్చేసిందని, నిను కోరి పార్ట్ 2లా అన్పించిందని తెలిపారు. ఈ సినిమా ఎవరితో తీయాలా అని ఆలోచించినప్పుడు కోర్టు సినిమాలో హీరో హీరోయిన్స్ సరిపోతారని భావించామని తెలిపారు. వారికి కూడా కథ నచ్చడంతో తెరకెక్కించినట్లు ఆయన తెలిపారు. కోన ఫిలిం కార్పొరేషన్ కొత్త వారితోనే ఎక్కువగా సినిమాలు చేయాలని భావించి ఆ దిశగానే అడుగులు వేస్తున్నట్లు కోన వెంకట్ చెప్పారు. 'బ్యాండ్ మేళం' సినిమాలో కొత్త దర్శకుడు సతీష్‌ని పరిచయం చేయడంతో పాటు చాలామంది కొత్తవాళ్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఈసినిమాలో ఆఖరి 30నిముషాలు బాగా ఆకట్టుకుంటుందని అన్నారు. చంద్రబోస్ రాసిన గీతాలు బాగున్నాయని అన్నారు. గోదావరి తీరం సినిమా షూటింగులకు ఎంతో అనువుగా ఉంటుందని, పోస్ట్ ప్రొడక్షన్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తే ఈ ప్రాంతం సినీ హబ్‌గా మారుతుందని కోన వెంకట్ అంచనా వేశారు. హైదరాబాద్‌లో అన్ని లొకేషన్లు చూపించేశామని, గోదావరి ప్రాంతంలో చాలా లొకేషన్లు ఇంకా చూపించాల్సి ఉందని ఆయన అన్నారు. హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ కాకినాడకు చెందిన తాను కోర్టు సినిమాతో సినీ రంగానికి పరిచయమై మంచిహిట్ అందుకున్నానని, ఇప్పుడు 'బ్యాండ్ మేళం' సినిమాతో ప్రమోషన్ వర్కులో భాగంతో గోదావరి జిల్లానుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమా కామెడీ చాలా బాగా వచ్చిందని, సినిమా అందరికీ నచ్చుతుందని, సినిమా చూస్తున్నంతసేపు నవ్వులే నవ్వులు అన్నట్లుగా ఉంటుందని ఆమె తెలిపారు. డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ కోన వెంకట్ తనకు అవకాశం కల్పించి దర్శకుడిగా పరిచయం చేయడం తన అదృష్టమని అన్నారు. అన్నివర్గాలను ఈ సినిమా ఆకట్టుకుంటుందన్నారు. సినిమాలో నటించిన రిషిత మాట్లాడుతూ తొలిసారిగా నడిచిన తనకు ఈ సినిమాలో మంచి పాత్ర లభించిందన్నారు. సినిమా తప్పకుండ అందరికీ నచ్చుతుందన్నారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ చిత్రానికి విజయ్ బుల్గనిన్ సంగీతం అందించారు. ఈ చిత్రం టీజర్ తాజాగా విడుదలై, వీక్ష కులకు నవ్వులు పూయిస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసిన 'తిప్పుకుంటున్నా' అనే పాటకు మంచి స్పందన లభించింది.



# పాలలో ఏమి కలిసిందో నిజనిర్ధారణ చేయరా..?

**నేషనల్ ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు ఎక్కడ! - చిన్నారుల ఆరోగ్యానికి ఏది భరోసా?**
**కల్తీపాల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ భరత్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీపాల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను శనివారం వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 వార్డులో ఐదుగురు చనిపోయారని, సుమారు 15 మంది సిటీ లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని వారిలో 11 మంది వెంటిలేటర్ పైన చికిత్స పొందుతూ ప్రాణాల కోసం పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెయిన్బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను చూస్తా ఉంటే గుండెలు పిండేసే దృశ్యాలు, తల్లిదండ్రుల హృదయ విదారక ఆక్రందనలు వినిపిస్తున్నాయి,అయినా కూటమి ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగా ఉందని విమర్శించారు. చనిపోయిన కనకరత్నం, రాజానగరం నియోజకవర్గ మహిళ పేర్లను నష్టపరిహార జాబితాలో ఎందుకు చేర్చలేదుని ఆయన ప్రశ్నించారు. నష్ట పరిహారం తూతూ మంత్రంగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని భరత్ మండిపడ్డారు. పసిపిల్ల ఆరోగ్యం కుదుటపడిన తర్వాత భవిష్యత్తులో ఏమన్నా ఆరోగ్య సమస్యలు వస్తె బాధ్యులు ఎవరని, దీని బాధ్యత ప్రభుత్వానిది కదా! దాని మీద కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనను ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.ఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా కల్తీ ఘటన కారకులు, కారణాలు, నివేదికలు ఏమి లేవని, ఇంత గోప్యంగా ఏమి చేస్తునట్టని ఆయన నిలదీశారు.అసలు వైద్యం పొందుతున్న బాధితులకు ఏ విధమైన ట్రీట్మెంట్ చేస్తున్నారో ప్రతీ విషయాన్ని ప్రజలకు తెలియచేయాలన్నారు. దీనికి కారకులైన ప్రతీ ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని, చనిపోయిన ప్రతీ ఒక్కరికి ఇరువైదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని భరత్ డిమాండ్ చేశారు.జరిగిన దుర్ఘటనకి మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించవలసిన ప్రభుత్వం, సాక్షాత్తు వైద్య శాఖ మంత్రి, షాడో ముఖ్యమంత్రి లోకేష్, చంద్రబాబు నాయుడు, ప్రశ్నించని పవన్ కళ్యాణ్ ఎక్కడా అని ఆయన ప్రశ్నించారు. క్రీడలు వినోదాలు అంటూ కాలక్షేపం చేసి ఇప్పుడు ఏదో కంటి తుడుపు కింద మంత్రులు రావడం విచారకరమన్నారు. ప్రతిపక్ష హోదాలో తాము మొదటి నుండి ఈ ఘటనలో ప్రజల పక్షాన నిలబడి, వారి ఆరోగ్య భద్రత కోసం పోరాడుతున్నామని, లేకుంటే కూటమి ప్రభుత్వం ఈ బాధితులను పట్టించుకునేది కాదని. ఇదీ నేటి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన అని భరత్ ధ్వజమెత్తారు..ప్రజల ప్రాణాలకు విలువ లేదని, ఆరోగ్య భద్రత లేదని, జగనన్న తలపెట్టిన ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం అర్ధాంతరంగా ఆపేశారని విమర్శించారు.సిబ్బంది వుండరు, సరైన మందులు ఉండవు, మౌళిక సదుపాయాలు లేనే లేవని భరత్ అన్నారు. చనిపోయిన కుటుంబాలకు పార్టీ తరపున భరత్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పారదర్శకంగా రవాణాశాఖ సేవలు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే..

**దళారులను ఆశ్రయించవద్దు - ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారితనంతో సేవలు అందిస్తాం : జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోని యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా, రవాణాశాఖకు సంబంధించిన అన్ని సేవలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉన్నాయని జిల్లా రవాణాధికారి ఆర్. సురేష్ (డి.టి.ఓ.) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన సేవలు Sarathi Parivahan వెబ్‌సైట్ ద్వారా, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, టాక్స్, ఇతర సేవలు Vahan Parivahan వెబ్‌సైట్ ద్వారా పొంద వచ్చునని తెలిపారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా గానీ, లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన మీ సేవ, ఈ సేవ, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. సంబంధిత రుసుములను కూడా ఆన్‌లైన్‌లోనే నేరుగా చెల్లించవచ్చునని వివరించారు. రవాణాశాఖ సేవల కోసం ఎటువంటి దళారులను సంప్రదించవద్దని, ప్రభుత్వం గుర్తించిన సేవా కేంద్రాల ద్వారానే దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారితనంతో సేవలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదిలావుండగా, తూర్పు గోదావరి జిల్లాలోని కొంతమంది వాహన డీలర్లు క్రొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌ల సందర్భంలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుముకంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అటువంటి అక్రమ వసూళ్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షోరూంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెల్లించవలసిన వాహన రిజిస్ట్రేషన్ ఫీజు, రోడ్ టాక్స్, సర్వీస్ చార్జీలు మొదలైన పూర్తి వివరాలను వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే విధంగా స్పష్టంగా ప్రదర్శించాల్సిందిగా డీలర్లకు ఆదేశించారు. ఆదేశాలను పాటించని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్రొత్త వాహనం కొనుగోలు సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుముకంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేసినట్లయితే, సంబంధిత రశీదులతో జిల్లా రవాణాధికారి మొబైల్ నెంబర్ 9281607020 కు సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అలాగే రవాణాశాఖ సేవలపై సమాచారం లేదా ఫిర్యాదుల కోసం నేరుగా కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా, పారదర్శకంగా మరియు బాధ్యతా యుతంగా రవాణాశాఖ సేవలు అందించనున్నట్లు జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్ వెల్లడించారు.




# రెండు డ్రెడ్జింగ్ బోట్ల సీజ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని పిడింగొయ్య, కోటిలింగాల గ్రామాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. తనిఖీ సందర్భంగా ధవళేశ్వరం ఇసుక ర్యాంపు నుండి రోటరీ కైలాస భూమి వరకు నదీ ప్రవాహంలో గట్టు సమీపంలోని కె ఎం 3.200 వద్ద డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక త్రవ్వకాల ఆనవాళ్లతో ఉన్న ఒక డ్రెడ్జింగ్ బోటును గుర్తించారు. అయితే ఆపరేటర్, యజమాని తదితరులు అందుబాటులో లేరు. స్థానిక విచారణలో అది ఏల్చూరు నివాసి యం. హరికృష్ణకు చెందినదిగా తెలిసిందన్నారు. అలాగే కోటిలింగాల డి-సిల్టేషన్ ఇసుక ర్యాంపు సమీపంలోని కె ఎం 11.900 వద్ద ఇసుక సక్కింగ్ మెషినరీతో కూడిన "ఇనవిల్లి వరసిద్ధి వినాయక" అనే పేరుగల మరో బోటును గుర్తించారు. ఆపరేటర్, యజమాని తదితరులు అక్కడ లేరు. స్థానిక విచారణలో అది విజయవాడకు చెందిన రాకీకి చెందినదిగా తెలిసింది. ఇసుకను డ్రెడ్జింగ్ ద్వారా త్రవ్వడం పర్యావరణ నిబంధనలు మరియు గౌరవ హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనకు దారి తీసినందున, పై రెండు బోట్లను జలవనరుల శాఖ ఏ.ఈ.కు తదుపరి చర్యల నిమిత్తం స్వాధీనం చేశారు. ఇసుక వెలికితీతకు డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇసుక త్రవ్వకాల కోసం సక్కింగ్ మెషినరీ కలిగిన డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించి నట్లయితే, సంబంధితులపై క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. సంయుక్త తనిఖీలలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, జలవనరుల శాఖ ఈ.ఈ. జి. శ్రీనివాసరావు, డి.ఈ. కే.ఆనందబాబు, ఏ.ఈ. శివ, గనులు మరియు భూగర్భ శాఖ సాంకేతిక సిబ్బంది మనీషా (టి.ఏ.), శైలజ (టి.ఏ.), జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సిబ్బంది యు.వి.వి. సత్యనారాయణ, ఎస్. సాయి కృష్ణ (హోం గార్డ్), రెవెన్యూ శాఖకు చెందిన వై.సత్యనారాయణ (వీఆర్ఓ, ధవళేశ్వరం), ఎస్.రామిరెడ్డి (వీఆర్ఓ, కోటిలింగాల వార్డు) పాల్గొన్నారు.

**విజయవాడ పీడీఎస్‌యు**

# జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరంలో మార్చి 3,4 తేదీలలో జరుగు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ప్రథమ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని (పిడిఎస్‌యు)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను రాజమహేంద్రవరం ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నందు శనివారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 52 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే అనేక సామాజిక దురాచారాలు సాంఘిక అనిచివేతలు వివక్ష లేని సమాజం కోసం తన గొంతును వినిపించిందని తెలిపారు. ఈ క్రమంలో జరుగుతున్న జాతీయ మహాసభల్లో భారతదేశ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించనున్నామనీ 1991 నూతన జాతీయ విద్యా విధానం విద్యా వ్యాపారీకరణ చెందడానికి కారణమైతే. బిజెపి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020 భారతదేశ యువతను కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు బానిసలుగా తయారు చేసే విధంగా ఉందని ఈ రకమైన పాలకుల లొంగుబాటు రాజకీయ ఆర్థిక విధానాలు దేశీయ మానవ వనరులను ప్రకృతి సంపదలను దోచుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఇది భారతదేశంలోని కోట్లాదిమంది దళిత గిరిజన వెనుకబడిన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా చేసి వారి భవిష్యత్తును ప్రమాదకరంగా మార్చబోతున్నదనీ అందుకే భారతదేశం జిఎటిస్ ఒప్పందం నుండి బయటకు రావాలని పిడిఎస్‌యు విద్యార్థి సంఘం పోరాడుతున్నది.విద్యలో ప్రైవేటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించడం ద్వారా సామాజిక ప్రయోజనాలు నెరవేరవు. పెట్టుబడి లక్ష్యం లాభాపేక్ష మాత్రమే. దీనివలన సమాజంలో ప్రజల మధ్య మరింతగా అంతరాలు పెరిగిపోతాయనీ ఆయన అన్నారు. ఈరోజు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులు, పెట్టుబడి, బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం కలగలిసి ఈ దేశ మూలవాసులపై ఆదివాసులపై ధమనకాండను కొనసాగిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా తమ భవిష్యత్ తరాల కోసం ప్రపంచ కార్పోరేట్ల కబంధ హస్తాల నుండి భారత దేశ మానవ వనరులను సహజ సంపదలను కాపాడుకోవడానికి మరో చారిత్రక పోరాటానికి నేటి విద్యార్థులు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షు కార్యదర్శులు పల్లాల మహోరెడ్డి, కె.భాను ప్రసాద్, పివైల్ నగర నాయకులు ఎం.రవణ, ఇళ్ళ చంద్రశేఖర్ రెడ్డి, దినేష్ బాబు, సంతోష్ కుమార్, విష్ణు, మార్క్స్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బార్ రద్దు చేయాలని 3వ రోజు నిరసన దీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐఎల్‌టిడి జంక్షన్ వద్ద జనావాసాల మధ్య బార్‌కు అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శనివారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. బిఎస్పీ జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్ (ఏసు) ఆధ్వర్యంలో స్థానిక మహిళా సంఘాలు, దళిత సంఘాలు, అంబేద్కర్ యూత్ సభ్యులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని శనివారం బిఎస్పీ నాయకులు ఇసుకపట్ల రాంబాబు, కొంకి రమేష్‌లు, నక్క వెంకటరత్నం సందర్శించి మద్దతు తెలిపారు. జనావాసాల మధ్య, అందునా కల్యాణమండపంలో బార్ ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇక్కడ బార్ ఏర్పాటు వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని, కావునా బార్‌కు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ బార్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని, బార్ ఏర్పాటు చేసే పక్షంలో పెద్దఎత్తున కార్యకర్తలతో నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి శేఖర్, ఐకెఐ భాస్కర్, పల్లవి, కేబుల్ శ్రీను, ఐఎల్‌టిడి ప్రాంతానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

**మధురపూడిలో ముఖ్యమంత్రి సహాయనిధి**

# చెక్కులు పంపిణీ చేసిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని మధురపూడి గ్రామానికి చెందిన సోడసాని శ్రీనుకి 40,541 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కును జనసేన పార్టీ నా సేన కోసం- నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, ముక్క రాంబాబు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు మహా సభల్లో సప్పాకు సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో సంగీత సాహిత్య నృత్య సభకు అధ్యక్ష స్థానం వహించి అశేషమైన విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు భాషా వైభవం సంగీత, నృత్య వైభవం తెలుగు భాష చరిత్ర తదితర అనేక అంశాలపై ఆసక్తికర ప్రసంగం చేసిన ప్రముఖ నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్‌ను సత్కరించారు.అనంతరం ప్రధాన వేదికపై శాసనమండలి అధ్యక్షులు మోషన్ రాజు, సిపిఐ జాతీయ నాయకులు నారాయణ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, మాజీ శాసనమండలి సభ్యులు చైతన్య రాజు తదితర ప్రముఖులచే చైతన్య ఉగాది పురస్కారం 2026తో సత్కరించారు. నాట్య పండితులు, నర్తన ఋషి, ఆలయ నృత్య పునర్ సృష్టికర్తగా సప్పా అందించిన సేవలను వారు కొనియాడారు.

# బొడ్డు చేతుల మీదుగా వృద్ధాప్య పింఛన్ పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పలువురు తెదేపా నాయకులు సీతానగరం రాజానగరం మండలంలో ఇంటింటికి వెళ్లి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం సీతానగరం, రాజానగరం గ్రామాల్లో గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి, వృద్ధులను ఆప్యాయతగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒకటో తారీకు ఆదివారం సెలవు దినం కావడంతో చంద్రబాబు నాయుడు ఒక రోజు ముందుగానే మీకు పెన్షన్లు అందజేస్తున్నాడని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం పనితీరు పట్ల పలువురు వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గంగిశెట్టి చంటిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, పలువురు తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కర్రి పాపారాయుడిని పరామర్శించిన మాజీ మంత్రి గొల్లపల్లి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఆర్తమూరుకు చెందిన పౌల్ట్రీ పరిశ్రమ నాయకులు పడాల సుబ్బారెడ్డి సతీమణి పడాల భూలక్ష్మి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా భూలక్ష్మి సోదరులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు ను శనివారం మాజీ మంత్రి, రాజోలు వైసిపి ఇన్ ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వైసిపి నాయకులు పాముల రాజేశ్వరి పాపారాయుడు ను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. భూ లక్ష్మీ భర్త పడాల సుబ్బారెడ్డి, ఆయన సోదరుడు తాపేశ్వరం సొసైటీ అధ్యక్షుడు పడాల రామకృష్ణ రెడ్డి, కుటుంబ సభ్యులు ను వారు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి వియ్యంకులు ఎస్ బి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సత్తి బుల్లి స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు చేయూతనివ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**ఫించన్లు పంపిణిలో ఎమ్మెల్యే వేగుళ్ళ**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పేద ప్రజలకు చేయూతనివ్వడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం మండపేట పట్టణంలో పలువురు ఫించను లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే వేగుళ్ళ ఫించన్లు పంపిణీ చేశారు. అదే విధంగా 12వ వార్డులో కర్ణం సత్యవతి, 17వ వార్డులో నాయుడు భద్రమ్మ లకు కొత్తగా మంజురు అయిన స్పౌస్ ఫించన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉంది, అదేవిధంగా ప్రజా సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా లేదా అని అడిగారు. అనంతరం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ దారులు బాధపడకూడదని సదుద్దేశంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధిని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పాలచర్ల బ్రహ్మాజి, బోళ్ళ అమ్మిరాజు, పలివెల వెంకటేశ్వరరావు, కాళ్ళకూరి శ్రీనివాస్, దుగ్గిరాల శేఖర్, గీసాల సత్తిబాబు, పలివెల దుర్గాప్రసాద్, పలివెల జానకి రామన్న, కుక్కల సత్యనారాయణ, కుక్కల రామారావు, తాత నాగలక్ష్మి, దొంతంశెట్టి శ్రీనివాస్, భలబద్ర రాజు, గ్రంధి సత్తిరాజు, గానుగుల బుజ్జి, మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వర రామలింగేశ్వర స్వామి వారు దేవాలయంలో వార్షిక కళ్యాణం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నాళం వారి వీధి లోని శ్రీ చౌడేశ్వర రామలింగేశ్వర స్వామి వారి గుడిలో వార్షిక కళ్యాణంలో భాగంగా శివ పార్వతిలకు అత్యంత వైభాగంగా కళ్యాణం నిర్వహించారు.ఆలయ అర్చకులు పి.మధు ఆధ్వర్యంలో పీటలు మీద డాక్టర్ బి టీ చౌదరి జానకి దేవి దంపతులు కూర్చొని పూజలు చేసారు. హోమం పూజాది కార్యక్రమం లు భక్తి శ్రద్ధలు తో నిర్వహించారు. స్వామి వారికి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు. కన్నుల పండుగగా కళ్యాణం జరిగింది.ఈ కార్యక్రమం లో శివకోటి శేష సుబ్రహ్మణ్యం, పెంకే గంగాధర్, ఉప్పు భద్రరావు, దుగ్గిరాల రాంబాబు తదితరులు పాల్గోని స్వామి వారిని దర్శనం చేసికొని తీర్ధ ప్రసాదంలు స్వీకరించారు.





# అంబానీ స్కూల్‌లో ఐశ్వర్యరాయ్ కూతురు..

## ఆరాధ్య బచ్చన్ లంచ్ బాక్స్‌లో ఏమేం ఉంటాయో తెలుసా?

ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కుమార్తె ఆరాధ్య బచ్చన్ ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ లో చదువుతుంది. ఆమె స్కూలింగ్ కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంటాయి. ఇప్పుడు, ఆరాధ్య గురించి ఆసక్తికర సమాచారం బయటకు వచ్చింది. బాలీవుడ్ నటి ఐశ్వర్య రాయ్ ఇప్పుడు సినిమాలేవీ చేయడం లేదు. అయితే తరచూ ఏదో ఒక విషయంతో వార్తల్లో నిలుస్తుంటుందీ అందాల తార. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ 2007లో వివాహం చేసుకున్నారు. వీరి వివాహం అప్పట్లో అత్యంత చర్చనీయాంశమైంది. ఇక కొన్ని రోజుల క్రితం వరకు అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ విడాకుల గురించి పుకార్లు తెగ షికార్లు చేశాయి. అయితే, ఈ విడాకుల వార్తలో నిజం లేదని అభిషేక్ బచ్చన్ స్వయంగా క్లారిటీ ఇచ్చాడు. ఈ మధ్యన ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ కుమార్తె తరచూ వార్తల్లో నిలుస్తోంది. సందర్భమేదైనా తన తల్లి చేయి పట్టకుని కనిపించే ఈ స్టార్ కిడ్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆరాధ్య బచ్చన్ సోషల్ మీడియాకు దూరంగా ఉంటుంది. ఆరాధ్య బచ్చన్ ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతుంది. ఆరాధ్య మాత్రమే కాదు, చాలా మంది సెలబ్రిటీల పిల్లలు ఈ స్కూల్‌లో చదువుతారు. ధీరూబాయ్ అంబానీ స్కూల్ కు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ముంబైలోనే కాకుండా దేశంలో కూడా చాలా విలాసవంతమైన పాఠశాల ఇది. ఇక్కడ పిల్లల కోసం ప్రతిదీ జాగ్రత్తగా చూసుకుంటారు. ముఖేష్ అంబానీ, నీతా అంబానీ మనవడు కూడా ఈ స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కుమార్తె మొదటి నుంచి ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ లోనే చదువుతోంది. ఈ స్కూల్ లో పిల్లల ఆరోగ్యంతో పాటు, వారి ఆహారం, డ్రింక్స్ విషయాల్లో చాలా శ్రద్ధ తీసుకుంటారు. ఇక్కడ పిల్లలకు వడ్డించే ఆహారంలో శుచి, శుభ్రతకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. కేవలం ఆరాధ్యకు మాత్రమే కాదు పాఠశాలకు వచ్చే ప్రతి స్టూడెంట్ కు తాజా, శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తారు. పిల్లలకు అల్పాహారం నుంచి భోజనం వరకు ప్రతిదీ పాఠశాలలోనే లభిస్తుంది. ఇక స్కూల్ ఫుడ్ మెనూను సంజీవ్ కపూర్ రూపొందిస్తారు. పిల్లలకు అత్యంత పోషకమైన ఆహారం అందించే విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పిల్లలు జంక్ ఫుడ్ కు అస్సలు అలవాటుపడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. పిల్లల ఫుడ్ మెనూ విషయానికి వస్తే.. ఆహారంలో తాజా పండ్లు ఎక్కువగా ఇస్తారు. పిల్లలు తమ రోజును బాగా ప్రారంభించడానికి పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ ను అందిస్తారు. భోజనంలో భాగంగా పనీర్ కూరగాయలు, ఆకుపచ్చ కూరగాయలు, సలాడ్, మల్టీ-ఫ్లోర్ చపాతీలు పిల్లలకు వడ్డిస్తారు.

# అతడు అమ్మాయిల పిచ్చోడు.. అందుకే వదిలేసా..

## బ్రేకప్‌పై తొలిసారి స్పందించిన టాలీవుడ్ హీరోయిన్..



ఇటీవల కాలంలో హీరోయిన్స్ తమ ప్రేమ, బ్రేకప్ విషయాన్ని ధైర్యంగా బయటపెడుతున్నారు. తాజాగా ఓ టాలీవుడ్ ముద్దుగుమ్మ సైతం తన మాజీ ప్రియుడి గురించి సంచలన విషయాలు బయటపెట్టింది. ఇంతకీ ఆ భామ ఎవరు.. ? అసలు తన జీవితంలో ఏం జరిగిందో తెలుసుకుందామా. తెలుగు, తమిళ చిత్రపరిశ్రమలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది హీరోయన్ ప్రియా భవాని శంకర్. అందం, అబినయం తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మొదట న్యూస్ రీడర్ గా కెరీర్ స్టార్ట్ చేసింది. ఆ తర్వాత 2014లో సీరియల్స్ ద్వారా టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టింది ఈ అమ్మడు. 2017లో మేయా దమాన్ అనే సినిమాతో తమిళం లోకి అడుగుపెట్టిన ఆమె.. కళ్యాణం కమనీయం అనే మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. తెలుగులో పలు చిత్రాల్లో నటించింది. ఇప్పటికీ కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాలతో అలరిస్తుంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ, టాక్సిక్ రిలేషన్ షిప్ గురించి బయటపెట్టింది. తన మాజీ ప్రియుడి గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. కాలేజీలో తాను ఒక అబ్బాయిని ప్రేమించానని.. కానీ అతడు చాలా మంది అమ్మాయిలతో డేటింగ్ చేశాడని.. అతడికి విధేయత లేదని తెలిపింది. అలాంటి బంధంలో ఎక్కువకాలం ఉండాల్సిన అవసరం లేదని.. అలాంటి రిలేషన్ షిప్స్ కు బ్రేకప్ చెప్పేసి బయటకు రావాలని అన్నారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవతున్నాయి. ప్రస్తుతం ఆమె తన స్నేహితుడు రాజ్ వేల్ అనే వ్యక్తితో ప్రేమలో ఉంది. ప్రియా భవానీ శంకర్.. తెలుగులో భీమా, సత్యదేవ్ జోడిగా జీబ్రా సినిమాల్లో నటించింది. అలాగే ఇండియన్ 2, డిమోంటీ కాలనీ 2, బ్లాక్ వంటి చిత్రాల్లో నటించింది. గ్లామరస్ రోల్స్ కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటుంది ఈ అమ్మడు.

క్రీడా వాయిస్

# రంజీలో జమ్మూ కాశ్మీర్ చారిత్రాత్మక విజయం..

## ప్రధాని మోదీ ప్రశంసల జల్లు..!

జమ్మూ కాశ్మీర్ తమ తొలి రంజీ ట్రోఫీని సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఆ జట్టుపై ప్రశంసల జల్లు కురిపించారు. లోయలో పెరుగుతున్న క్రీడా ప్రతిభను ఈ విజయం చాటిచెబుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత దేశవాళీ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర లిఖితమైంది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, జమ్మూ కాశ్మీర్ క్రికెట్ జట్టు తమ మొట్టమొదటి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. హుబ్లీలోని కేఎస్సీఏ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో బలమైన కర్ణాటక జట్టును ఓడించి, జమ్మూ కాశ్మీర్ జట్టు ఈ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ చారిత్రాత్మక ఘట్టంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**జట్టు పట్టుదలకు నిదర్శనం : ప్రధాని మోదీ..**

ఈ విజయంపై ప్రధాని ట్వీట్ చేస్తూ.. "తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన జమ్మూ కాశ్మీర్ జట్టుకు ఇవే నా అభినందనలు! ఈ చారిత్రాత్మక విజయంతో జట్టులోని అసాధారణమైన పట్టుదల, క్రమశిక్షణ, ఆటపై వారికున్న మక్కువను ప్రతిబింబిస్తోంది. ఇది జమ్మూ కాశ్మీర్ ప్రజలకు గర్వకారణమైన క్షణం" అంటూ ప్రశంసలు కురిపించారు. లోయలో పెరుగుతున్న క్రీడా ప్రతిభను ఈ విజయం చాటిచెబుతోందని, ఈ విజయం మరెంతో మంది యువ అథ్లెట్లకు పెద్ద కలలు కనడానికి, క్రీడల్లో రాణించడానికి స్ఫూర్తినిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

**విజయానికి కారకులు వీరే..**

కెప్టెన్ పరాస్ డోగ్రా నేతృత్వంలో జమ్మూ కాశ్మీర్ జట్టు టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శన చేసింది.

బ్యాటింగ్ విభాగంలో శుభమ్ పుండిర్, కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రా అద్భుత సెంచరీలతో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించారు.






బౌలింగ్ విభాగంలో ఈ సీజన్ టాప్ వికెట్ టేకర్ ఆకిబ్ నబీ తన పేస్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించి విజయంలో కీలక భూమిక పోషించాడు.

**కొత్త శకానికి నాంది..**

జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఉమర్ అబ్దుల్లా కూడా ఈ విజయాన్ని కొనియాడారు. ఈ గెలుపు కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా, ఆ ప్రాంతంలోని యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చారిత్రాత్మక విజయంతో దేశవాళీ క్రికెట్ మ్యాప్‌లో జమ్మూ కాశ్మీర్ తనదైన ముద్ర వేసింది.




# రింకు సింగ్ తర్వాత మరో స్టార్ ప్లేయర్ ఔట్...

టీ20 ప్రపంచకప్ 2026 చివరి దశకు చేరింది. సూపర్ 8 దశ మ్యాచ్‌లు ముగిసే సమయం ఆసన్నమైంది. ఇప్పుడంతా సెమీస్ చేరే ఆ రెండు జట్లపైనే ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో కొంతమంది ఆటగాళ్లు పలు కారణాలతో జట్టును వీడి వెళ్లారు. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 మధ్యలోనే భారత లోయర్ - ఆర్డర్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ తన తండ్రి మరణంతో జట్టును వీడి ఇంటికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన గైర్హాజరీ టీమిండియా ప్రణాళికలకు దెబ్బతీసినప్పటికీ, త్వరలోనే జట్టుతో మళ్లీ చేరుతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు రింకు సింగ్ తర్వాత మరో కీలక ఆటగాడు కూడా కుటుంబ కారణాలతో టోర్నీని మధ్యలోనే వదిలి ఇంటికి వెళ్లడం చర్చనీయాంశమైంది.

**రింకు తర్వాత మరో ఆటగాడు టీ20 వరల్డ్ కప్‌కు దూరం..**

రింకు సింగ్ తర్వాత ఇప్పుడు న్యూజిలాండ్ జట్టుకు చెందిన బౌలర్ మ్యాట్ హెన్రీ కూడా టోర్నీని తాత్కాలికంగా వీడుతున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన కీలక మ్యాచ్ అనంతరం మ్యాట్ హెన్రీ స్వదేశానికి వెళ్లనున్నాడు. కారణం ఆయన రెండోసారి తండ్రిగా మారాడు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com